

భగీరథ ప్రయత్నం



వంక నీటిని ట్రాక్టర్ ఇంజన్‌తో పంట పొలానికి పెట్టుకుంటున్న దృశ్యం

ట్రాక్టర్ ఇంజన్ సాయంతో పంటలను తడుపుకుంటున్న రైతులు

చాగలమర్రి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలో చివరి దశలో ఉన్న వివిధ పంటలను కాపాడుకునేందుకు రైతులు భగీరథ ప్రయత్నం చేశారు. బుధవారం చాగలమర్రిలోని దస్తగిరిస్వామి రహదారిలోగల రైతులు రామసుబ్బయ్య, వెంకటసుబ్బయ్య, రమణ, లక్ష్మయ్య శ్రీను, రాము, బాష మరి కొందరు రైతులు వాడుముఖం పట్టిన కంది, జొన్న, పెసర పంటలను కాపాడుకునేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నారు. తుఫాన్ ప్రభావం కూడా లేకపోవడంతో పంటలను కాపాడుకునేందుకు చివరి ప్రయత్నం చేస్తున్నారు. రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న పంటలను కాపాడుకోవడానికి అష్టకష్టాలు పడుతున్నారు. సమీపంలోని వంక నీటి వద్ద ట్రాక్టర్ ఇంజన్ ఏర్పాటు చేసి అక్కడి నుంచి పంట పొలాల వరకు 70 లెన్తుల పైపులు వేసి పంటలను తవడుపుకుంటున్నారు. ఎలాగైనా పంటలను కాపాడుకోవాలని అన్నదాత చివరి ప్రయత్నం సాగిస్తున్నారు.



రెండు కిలోమీటర్లు వేసిన నీటి పైపులు



వాడుముఖం పట్టిన జొన్న పంట



పంటను తడుపుకుంటున్న రైతు

11,844 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు

- క్యాన్సర్ పరీక్షలకు సహకరించండి
- జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ వెంకటరమణ

మహానంది, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ బాలల ఆరోగ్య రక్షణ కింద నంద్యాల జిల్లాల్లో 11 వేల 844 మంది విద్యార్థులకు వివిధ రకాల పరీక్షలు నిర్వహించినట్లు ద జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ వెంకటరమణ తెలిపారు. బుధవారం మహానంది మండలం ఎం.తిమ్మాపురంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీఎంహెచ్‌ఓ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి పరిస్థితులపై వైద్యాధికారి భగవాన్‌దాస్, ఎంపీహెచ్‌ఈఓ ఉసేన్‌రెడ్డిల ద్వారా తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వచ్చే నెల 7వ తేది ముఖ్యమంత్రి చంద్రబాబు నాయిడు వర్చువల్‌గా మెగా పేరేంట్స్ టీచర్స్ మీటింగ్‌ను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా నంద్యాల జిల్లాలో 30 పాఠశాలలను ఎంపిక చేశామన్నారు. క్యాన్సర్ పరీక్షలకు అందరూ సహకరించాలని కోరారు. ఇటీవల నిర్వహించిన క్యాన్సర్ పరీక్షల్లో 2598 ఓవరల్‌గా క్యాన్సర్ లక్షణాలు ఉన్నట్లు అనుమానితులుగా గుర్తించామని వెల్లడించారు. ఇందులో 373 బ్రెస్ట్, 161 సర్వైకల్ క్యాన్సర్ అనుమానితులుగా గుర్తించామన్నారు. వీరికి ఎన్టీఆర్ వైద్య సేవా కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేస్తామన్నారు. తిమ్మాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు చికిత్సలు నిర్వహించేందుకు అవసరమైన పరికరాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. సిబ్బంది ఎంతో జాగ్రత్తతో ఉండి మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నారని చెప్పారు



తిమ్మాపురంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకటరమణ

15వ తేదీ నాటికి ఇళ్లు పూర్తి కావాలి

కలెక్టర్ రాజకుమారి



హౌసింగ్ అధికారులకు ఆదేశాలు జారీచేస్తున్న కలెక్టర్

నంద్యాల కల్చరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద రూఫ్ స్థాయి, ఆర్‌సీ స్థాయిలో ఉన్న 1,169 గృహాలు డిసెంబరు 15వ తేదీ నాటికి పూర్తయి గృహ ప్రవేశానికి సిద్ధంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాజకుమారి హౌసింగ్ డీఈ, ఎఈలను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని ఎన్‌ఐసీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పూర్తి దశలో ఉన్న ఇళ్ల నిర్మాణాల ప్రగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా డిసెంబరు రెండవ పక్షంలో లక్ష గృహాలు పూర్తి చేసి లబ్ధిదారులతో గృహ ప్రవేశాలు చేయించాలన్న అవగాహనతో జిల్లాల వారీగా లక్ష్యాన్ని కేటాయించిందన్నారు. ఇందులో భాగంగానే జిల్లాలో 2822 గృహాలకుగాను 1653 గృహాలు పూర్తయ్యాయని మిగిలిన రూఫ్ స్థాయి, ఆర్‌సీ స్థాయిలో ఉన్నాయని తెలిపారు. వీటిని డిసెంబరు 15వ తేదీ నాటికి పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

శ్రీశైలం నుంచి విద్యుత్ ఉత్పత్తిని ఆపండి

సాగు నీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామి రెడ్డి



మాట్లాడుతున్న దశరథరామిరెడ్డి

నంద్యాల కల్చరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం రిజర్వాయరు నుంచి విద్యుత్ ఉత్పత్తిని వెంటనే ఆపాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామి రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం నంద్యాల రాయలసీమ సాగునీటి సాధన సమితి కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ తాగు, సాగు నీటి రక్షణకు రూపొందించిన శ్రీశైలం రిజర్వాయర్ నుంచి వందలాది టీఎంసీల నీళ్ల దిగువకు వెళ్లినప్పటికీ రాయలసీమలోని ప్రాజెక్టుల ఆయకట్టుకు పూర్తిస్థాయిలో నీరు అందించడంలో రాష్ట్ర జలవనరుల శాఖ విఫలమైందని అన్నారు. జూన్ మొదటి వారంలో కృష్ణ, తుంగభద్ర నదుల నుంచి శ్రీశైలం జలాశయం రిజర్వాయరుకు 1532 టీఎంసీల నదీజలాలు చేరాయన్నారు. దాదాపు వంద రోజుల పాటు నిరంతర ప్రవాహం కొనసాగినప్పటికీ కృష్ణా, పెన్నా జలాల సంరక్షణలో పాలకుల వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోందన్నారు. తాగు, సాగు నీరు అవసరాలు తీరిన తరువాతనే విద్యుత్ ఉత్పత్తి చేపట్టాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర విభజన చట్టంలో స్పష్టంగా పేర్కొన్నప్పటికీ ఈ విధి విధానాలు అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమవుతోందని విమర్శించారు. శ్రీశైలం ప్రాజెక్టులో విద్యుత్ ఉత్పత్తిని తక్షణమే నిలుపుదల చేసి ప్రాజెక్టు విధివిధానాలను కఠినంగా అమలు చేయాలని ఆయన కోరారు. సమితి ఉపాధ్యక్షుడు వైఎన్ రెడ్డి పాల్గొన్నారు.

నేడు, రేపు ఆర్‌యూలో పీజీ స్పాట్ అడ్మిషన్లు

కర్నూలు అర్బన్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): 2024-25 విద్యా సంవత్సరం ఎమ్మెస్సీ, ఎంఏ, ఎంకామ్ కోర్సుల్లో మిగిలిన సీట్లను స్పాట్ అడ్మిషన్ల కింద భర్తీ చేస్తున్నట్లు రాయలసీమ యూనివర్సిటీ డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ ఆచార్య నరసింహులు తెలిపారు. పీజీ సెట్ 2024 పరీక్షలో అర్హత సాధించిన దరఖాస్తులు చేసుకున్న విద్యార్థుల కోసం స్పాట్ అడ్మిషన్ల కోసం దరఖాస్తుతోపాటు విద్యార్హతల ఒరిజనల్ ధృవపత్రాలు, కులధృవీకరణ పత్రాలతో పాటు రిజిస్ట్రేషన్ ట్యూషన్ ఫీజులతో ఈ నెల 28, 29న వర్సిటీలోని డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ కార్యాలయంలో ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు హాజరు కావాలని తెలిపారు. అడ్మిషన్లలో వివిధ కోర్సుల్లో చేరే విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ సౌకర్యం వర్తించదని అన్నారు.

కురువ కార్పొరేషన్ చైర్మన్‌గా దేవేంద్రప్ప ప్రమాణ స్వీకారం



కురువ కురుమ కార్పొరేషన్ చైర్మన్ గా ప్రమాణ స్వీకారం చేస్తున్న దేవేంద్రప్ప

ఆదోని, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ గొల్లపూడి బీసీ భవనంలో కురువ కురుమ కార్పొరేషన్ చైర్మన్‌గా ఆదోని మండలం పెద్ద హరివాణం గ్రామానికి చెందిన మాన్వి దేవేంద్రప్ప పదవీ బాధ్యతలు స్వీకరించారు. బుధవారం అసిస్టెంట్ డైరెక్టర్ తనూజ కార్పొరేషన్ చైర్మన్ దేవేంద్రప్ప చేత ప్రమాణ స్వీకారం చేయించారు ఈ సందర్భంగా దేవేంద్రప్ప మాట్లాడారు. టీడీపీ కోసం కృషి చేసినందుకు అధినేత చంద్రబాబునాయుడు ఈ పదవి తనకు ఇచ్చారని దేవేంద్రప్ప అన్నారు.

పెళ్లి వేడుకలో విషాదం

డీజే వాహనం ఢీకొని బాలుడి మృతి

7లో

ఐదు లక్షల హెక్టార్లలో ఆయిల్‌ఫాం తోటలు

రాష్ట్ర ఉద్యాన శాఖ అడిషనల్ డైరెక్టర్ బాలాజీనాయక్



పెద్దకంబలూరు ఆయిల్ ప్లాంటు నర్సరీలో టెక్నాలజీ పరిశీలిస్తున్న బాలాజీనాయక్

రుద్రవరం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ఐదు లక్షల హెక్టర్లలో ఆయిల్‌ఫాం తోటలు సాగు చేసే అవకాశం ఉందని ఉద్యాన శాఖ రాష్ట్ర అడిషనల్ డైరెక్టర్ బాలాజీనాయక్ అన్నారు. బుధవారం మండలంలోని పెద్దకంబలూరు మెట్ట వద్ద నిర్వహించిన 3ఎఫ్ ఆయిల్‌ఫాం నర్సరీల్లో మొక్కలు పరిశీలించారు. అనంతరం ఆయన మొక్కలు పెంచే టెక్నాలజీని పరిశీలించి నర్సరీ నిర్వాహకులను అభినందించారు. ఆరు నెలల క్రితం నంద్యాల జిల్లాలో ఆయిల్‌ఫాం నర్సరీలకు మండలాలను కేటాయించామన్నారు. మొక్కల పెంపకంలో అత్యాధునిక టెక్నాలజీ ఉపయోగించి రైతులకు నాణ్యమైన మొక్కలు అందించేందుకు సిద్ధం చేశామని తెలిపారు. నాలుగు నెలల తరువాత రైతులకు మొక్కలు అందిస్తామని చెప్పారు. ఆయిల్‌ఫాం తోటల పెంపకానికి ప్రభుత్వం రూ.380 కోట్లు మంజూరు చేసిందన్నారు. ఈ ఏడాది 35 వేల హెక్టార్లలో ఆయిల్‌ఫాం తోటలు పెంచామని వెల్లడించారు. ఇప్పటికే 2.25 లక్షల హెక్టార్లలో తోటలు పెంచామని చెప్పారు. రాష్ట్రంలో ఐదు లక్షల హెక్టార్ల వరకు ఆయిల్‌ఫాం తోటలు పెంచడానికి అవకాశం ఉందన్నారు. ఒక హెక్టారుకు 22 మెట్రిక్ టన్నులు దిగుబడి వస్తుందని తెలిపారు. ప్రతి రైతుకు పెట్టుబడి పోయి ఏడాదికి రూ.2.55 లక్షలు ఆదాయం వస్తుందని అన్నారు. దేశంలోనే ఆయిల్‌ఫాం తోటల పెంపకంలో ఏపీ ముందుందని తెలిపారు. ఆయన వెంట జిల్లా ఉద్యానశాఖాధికారి నాగరాజు, నర్సరీ జీఎం విజయప్రసాద్, జోనల్ హెడ్ సీవీ ప్రసాద్ పాల్గొన్నారు.

వెదురు సేకరణకు ఉత్తర్వులు

కార్యాలయంలో అధికారుల సమీక్ష

రుద్రవరం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : నల్లమల రుద్రవరం రేంజ్‌లో వెదురు సేకరణకు రాష్ట్ర ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటరు ఫారెస్టు అండ్ హెడ్ ఆఫ్ ఫారెస్టు ఫోర్స్ చిరంజీవి చౌదరి నుంచి ఉత్తర్వులు అందాయి. డిసెంబరు 15 నుంచి వెదురు సేకరణ ఉంటుంది. బుధవారం రుద్రవరం ఫారెస్టు కార్యాలయంలో అధికారులు వెదురు సేకరణపై రేంజర్ శ్రీపతినాయుడు అధికారులతో సమీక్ష నిర్వహించారు. అడవిలో శాంపిల్ ప్లాట్ 10 నుంచి 15 రోజుల్లో చేసి నివేదిక ఇవ్వాలని ఆదేశాలున్నాయి. వెదురు సేకరణ డీసీ-3 విభాగంలో వెదురు సేకరణ చేసేందుకు నిర్ణయించారు. రుద్రవరం రేంజ్ పరిధిలోని చిల్లమానుపెంట, గొర్రెగుంట, మామిడిమాను చెలిమ, అహోబిలంలో వెదురు కూపులు, వెదుర్లు సేకరించేందుకు ఫారెస్టు ఉన్నతాధికారులు నిర్ణయించారు. ఈమేరకు అధికారులకు ఉత్తర్వులు ఇచ్చారు.

స్థలం ఇచ్చే ప్రసక్తే లేదు..!

- మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్, వైద్యుల ఏకగ్రీవ తీర్మానం
- మున్సిపల్ అధికారుల ప్రతిపాదనలపై మండిపాటు
- మా నిర్ణయాన్ని కాదని ముందుకుపోతే ప్రత్యక్ష ఆందోళనలకు సిద్ధం
- హెచ్చరిస్తున్న జూనియర్ డాక్టర్లు



ఇన్‌గేట్ పక్కన ఉన్న ఖాళీ స్థలం ఇదే


కర్నూలు హస్పిటల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): 'రోడ్డు విస్తరణలో కోల్పోయే షాపులకు ప్రత్యామ్నాయంగా మెడికల్ కాలేజీ స్థలం ఇచ్చే ప్రసక్తే లేదు. కాదు కూడదని బలవంతంగా ముందుకుపోతే ప్రత్యక్ష ఆందోళనకు ఏమాత్రం వెనుకాడబోం' అని జూనియర్ డాక్టర్లు హెచ్చరిస్తున్నారు. కర్నూలు మెడికల్ కాలేజీ ప్రవేశ ద్వారం కుడి వైపున ఉన్న దాదాపు ఎనిమిది సెంట్ల ఖాళీ స్థలాన్ని సోమవారం రెవెన్యూ అధికారులు సర్వే చేయడం, మంగళవారం కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు స్థలాన్ని కేటాయించాలని ప్లాన్‌తో లెటర్ తీసుకొని కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌కు అందజేయడం వంటివి తాజాగా అలజడి రేపాయి. కర్నూలు నగరంలో రోడ్డు విస్తరణకు నగర పాలక మున్సిపల్ అధికారులు ప్రణాళికను సిద్ధం చేశారు. దీంతో మెడికల్ కాలేజీ ఆనుకొని ఉన్న ఎనిమిది షాపులను తొలగించి వస్తోంది. ఇందుకు ప్రత్యామ్నాయంగా మెడికల్ కాలేజీ ఇన్‌గేట్, ఎగ్జిట్ గేట్‌ల మధ్య ఉన్న ఎనిమిది సెంట్ల స్థలాన్ని ఇవ్వాలనే ప్రతిపాదన తెరపైకి తెచ్చారు. దీనిపైనే మెడికల్ కాలేజీలో వివాదం నెలకొంది. ఈ ప్రతిపాదనలపై కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డా.కె.చిట్టినరసమ్మ వైద్యులతో జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. మెడికల్ కాలేజీలోని ఇన్‌గేట్ కుడివైపున ఉన్న ఖాళీ స్థలాన్ని షాపులకు ఇవ్వడం కుదరదని ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. ఈ ప్రతిపాదనను తిరస్కరించాలని వైద్యులు ప్రిన్సిపాల్‌కు తెలియజేశారు.

మిగతా 6లో..

ఓ ప్రాజెక్టు వ్యథ

12 ఏళ్లుగా అదే నిర్లక్ష్యం..!

- వీఆర్ఎస్‌పీ నిర్వహణపై కొనసాగుతున్న వివక్ష
- జైకా నిధులు ఖర్చు చేసినా మెరుగుపడని పరిస్థితి
- ప్రాజెక్టు నీటి యాజమాన్య సంఘం ఏర్పాటులో జాప్యం
- మరమ్మతులకు గురైన పంట కాల్వలు
- ఆందోళన చెందుతున్న రెండు మండలాల రైతులు
- ప్రాజెక్టు ప్రారంభించి నేటికి 12 ఏళ్లు




ఆత్మకూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు ప్రాంతంలోని రెండు మండలాల రైతుల కన్నీళ్లను తుడిచే వరదరాజ స్వామి ప్రాజెక్ట్‌పై పాలకుల నిర్లక్ష్యం పన్నెండేళ్లుగా కొనసాగుతోంది. ఈ ప్రాజెక్ట్ ప్రారంభమై 12 ఏళ్లు అవుతున్నా ఏ ఒక్క ప్రజాప్రతినిధి కూడా దారి వైపు తిరిగి చూడలేదు. కనీసం ప్రాజెక్టును ప్రారంభించిన రోజును కూడా గుర్తు చేసుకోవడం లేదు. 2018లో టీడీపీ హయాంలో ప్రాజెక్ట్ అభివృద్ధికి జపాన్ ఇంటర్నేషనల్ కోఆపరేటివ్ ఏజెన్సీ (జైకా) సంస్థ రూ.20 కోట్ల ఆర్థిక సాయాన్ని అందించగా ఆ నిధులను వైసీపీ హయాంలో ఇష్టారాజ్యంగా ఖర్చు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి.

టీడీపీ హయాంలో రూ.19.5కోట్ల జైకా నిధులు

కొత్తపల్లి, ఆత్మకూరు మండలాల్లోని 13గ్రామాల పరిధిలోని సుమారు 12వేల ఎకరాలకు సాగునీరందించేలా ప్రాజెక్ట్‌ను స్థిరీకరించేందుకు జపాన్ దేశానికి చెందిన జపాన్ ఇంటర్నేషనల్ కో ఆపరేటివ్ ఏజెన్సీ (జైకా) సంస్థ ముందుకొచ్చింది. 2017 నవంబర్‌లో, 2018 మార్చిలో జైకా ప్రతినిధులు వీఆర్ఎస్పీని సందర్శించి ప్రాజెక్ట్‌కు సంబంధించిన సమగ్ర వివరాలు సేకరించారు. వీఆర్ఎస్పీకు శాశ్వతంగా ఆయకట్టు స్థిరీకరణ చేపట్టడమే కాకుండా ప్రాజెక్ట్ నిర్వహణ కూడా సజావుగా ఉండాలని జైకా ప్రతినిధులు నిధులు విడుదల చేశారు. గత వైసీపీ హయంలో జైకా నిధులను ఖర్చు చేసినా పురోగతి కనిపించలేదు.

వీఆర్ఎస్పీ క్రస్టు గేట్లు



నీటితో కళకళలాడుతున్న జలాశయం



కూటమి ప్రభుత్వంపైనే ఆశలు

వర్షాభావ పరిస్థితులతో ఏటా నష్టపోతున్న వీఆర్ఎస్పీ ఆయకట్టు రైతులను ఆదుకునేందుకు గత టీడీపీ ప్రభుత్వ హయంలో సిద్ధాపురం ఎత్తిపోతల పథకంలో భాగంగా వెలుగోడు జలాశయం నుంచి సిద్ధాపురం చెరువులోకి చేరిన నీటిని గ్రావిటీ కెనాల్‌తో ఇందిరేశ్వరం, వడ్లరామాపురం మీదుగా కొట్టాలచెరువు గ్రామ సమీపంలోని వీఆర్ఎస్పీ ప్రధాన కాల్వకు అనుసంధించాలని భావించారు. ఇందుకు సంబంధించి రూ.25కోట్లతో ఇరిగేషన్ అధికారులు ప్రణాళిక అంచనాలు సిద్ధం చేసినప్పటికీ వైసీపీ అధికారంలోకి రావడంతో ఆ ప్రక్రియకు బ్రేక్ పడింది. శిల్పా చక్రపాణిరెడ్డి తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే కృష్ణానది నుంచి వీఆర్ఎస్పీ ప్రాజెక్ట్‌కు ఎత్తిపోతల పథకాన్ని ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చి విస్మరించారు. ఇదిలావుంటే గత ఎన్నికల్లో శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి కూడా వీఆర్ఎస్పీ ఆయకట్టు స్థిరీకరణకు తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. దీంతో ఆయకట్టు రైతాంగం కూటమి ప్రభుత్వంపై కొండంత ఆశలు పెట్టుకుంది.

లైనింగ్ లేని పంట కాలువలు





వీఆర్ఎస్పీకి చేరుకునే బీటీ రహదారి దుస్థితి ఇలా

వరదరాజస్వామి ప్రాజెక్టు నిర్వహణలో లోపాలు ..

- ప్రాజెక్ట్ నుంచి ప్రధాన కాల్వల గుండా ప్రవహించే సాగునీటి కాల్వలకు రివిట్‌మెంట్ లేకపోవడంతో నీటి వృథా అధికంగా వుంది.
- ప్రధాన కాల్వల గుండా గేట్ల ఏర్పాటు, డివైడర్లు, చెక్‌డ్యాంల నిర్మాణం కూడా చేపట్టలేదు. దీంతో నీటి సరఫరా అస్తవ్యస్తంగా మారింది.
- పంటపొలాలకు చేరుకునేందుకు కాల్వపై అక్కడక్కడ ఏర్పాటు చేయాల్సిన వంతెనల నిర్మాణాలు జరగలేదు. దీంతో పలు గ్రామాల రైతులు కాల్వపై రాకపోకలు జరిపేందుకు నానా అవస్థలు ఎదుర్కొంటున్నారు.
- పంటకాల్వల్లో పూర్తిస్థాయిలో పూడిక నిల్వ వుండి ప్రవాహ మార్గానికి అంతరాయం కల్గిస్తున్నప్పటికి ఈ సమస్య కూడా రైతులకు జఠిలంగా వుంది.
- ప్రాజెక్ట్ నిర్వహణలో భాగంగా జనరేటర్ ఏర్పాటు చేయాల్సి వుంది.
- అన్ని గ్రామాలకు సంబంధించి ప్రధాన కాల్వ నుంచి నీటి సరఫరా జరిగే పంటకాల్వల్లో పూడికకు అధికమైంది. పూడిక తీసి రివిట్‌మెంట్ ఏర్పాటు చేయాల్సి వుండగా నిధుల కొరత వెంటాడుతోంది.
- ప్రాజెక్ట్‌ను చేరుకునేందుకు వున్న రహదారిపై పూర్తిగా దెబ్బతిన్నప్పటికీ దీనిపై అధికారులు చర్యలు తీసుకోలేదు.
- ప్రత్యేకించి పంటకాల్వల ఏర్పాటులో భూములను నష్టపోయిన రైతాంగానికి పరిహారం ఇవ్వకపోవడంతో వారు తమ పొలాల్లో వున్న కాల్వలను పూడివేశారు. దీంతో దిగువ ఆయకట్టుకు నీరెళ్లే అవకాశమే లేదు.
- ప్రాజెక్ట్ నీటి యాజమాన్య సంఘం ఏర్పాటులో జాప్యం కొనసాగుతూనే వుంది. తద్వారా రైతుల నుంచి నీటి తీరువా వసూలు చేయకపోవడంతో ప్రాజెక్ట్ నిర్వహణకు ఆటంకంగా మారుతోంది.
- సిద్ధాపురం జలాలను గ్రావిటీ ద్వారా వీఆర్ఎస్పీ ప్రధాన కాల్వలకు నీటిని చేర్చవచ్చు. అయితే ఆ దిశగా అధికారులు, ప్రజాప్రతినిధులు ఆలోచించడం లేదు.
- వీఆర్ఎస్పీ ప్రాజెక్ట్ నిర్వహణలో పనిచేస్తున్న అధికారులెవరూ బాధ్యతగా వ్యవహరించడం లేదన్న విమర్శలు ఉన్నాయి. డ్యూటీలకు హాజరు కాకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరించడం వల్ల ప్రాజెక్ట్ నిర్వహణ అధ్వానంగా మారినట్లు ఆరోపణలు ఉన్నాయి.

స్థలం ఇచ్చే ప్రసక్తే లేదు..!



(5వ పేజీ తరువాయి)

2012లో రోడ్డు వెడల్పులో భాగంగా కర్నూలు జీజీహెచ్ నుంచి కర్నూలు మెడికల్ కాలేజీ వరకు కొంత స్థలాన్ని వదులుకోవాల్సి వచ్చింది. అప్పుడు ఆసుపత్రి మెడికల్ కాలేజీలోని కాంపౌండ్, పరిపాలన విభాగం భవనాలు, మైదానం మొదలుకొని దాదాపు పది అడుగుల మేర లోపలికి జరిగాల్సి వచ్చింది. మళ్లీ ఇప్పుడు రాజ్‌విహార్ నుంచి కలెక్టరేట్ వరకు రోడ్డు విస్తరణ పనులు చేపట్టనున్నారు. కర్నూలు మెడికల్ కాలేజీ ఎగ్జిట్ గేట్, ఇన్‌గేట్‌ల మధ్య ఈ ఎనిమిది షాపులు ఉన్నాయి. ఆ షాపుల కారణంగా రహదారి ఇరుకుగా మారి నిత్యం ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. రోడ్డు విస్తరణలో భాగంగా ఈ షాపులను తొలగించాల్సి ఉంది. ఇంతవరకు బాగానే ఉన్న తొలగించే షాపులకు ప్రత్నామ్నాయంగా మెడికల్ కాలేజీకి చెందిన ఎనిమిది సెంట్లను ఇవ్వాలన్న మున్సిపల్ అధికారుల ప్రతిపాదనలపైనే వైద్యులు, జూనియర్ డాక్టర్లు భగ్గుమంటున్నారు. గతంలో కాలేజీ స్థలాన్ని వదులుకున్నామని, ఇప్పుడు షాపుల కోసం స్థలాన్ని ఇవ్వడం కుదరదని తేల్చి చెబుతున్నారు. గతంలోనే ఆసుపత్రి, కాలేజీ గ్రౌండ్ స్థలాన్ని వదులుకున్నామని, ఇప్పుడు షాపులకు మళ్లీ స్థలం ఇవ్వడం కుదరదని, దీన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని చెబుతున్నారు. అవసరమైతే ఆందోళనలు చేపడతామని హెచ్చరిస్తున్నారు.

ఖాళీ స్థలాన్ని ఇచ్చేది లేదు



కర్నూలు మెడికల్ కాలేజీలోని ఇన్‌గేట్ కుడి వైపున ట్రాన్స్‌ఫార్మర్ ఉన్న ఖాళీ స్థలాన్ని షాపుల నిర్మాణానికి ఇచ్చేది లేదు. మున్సిపల్ అధికారులు ఖాళీ స్థలాన్ని షాపులకు ఇవ్వాలని ప్లానింగ్ లెటర్‌ను తీసుకు వచ్చారు. దీనిపై రిప్లయ్ లెటర్‌ను రాసి తమ అభిప్రాయాన్ని తెలియజేస్తాం. ఇప్పటికే కాలేజీ వద్ద ఇన్‌గేట్, అవుట్‌గేట్ వద్ద ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉంది. ఇన్‌గేట్ పక్కన షాపులు కడితే ట్రాఫిక్ రద్దీ పెరిగి రాకపోకలకు, విద్యార్థులు, వైద్యులకు ఇబ్బందిగా మారుతుంది. ఖాళీ స్థలంలో ఎంబీబీఎస్ వైద్య విద్యార్థుల కోసం కామన్ రూమ్‌ను ఏర్పాటుకు స్థలం కేటాయించాం. ఆ స్థలాన్ని ఇతరులకు ఇవ్వడం కుదరని పని.

- డాక్టర్ కె.చిట్టినరసమ్మ, ప్రిన్సిపాల్, కర్నూలు మెడికల్ కాలేజీ

కాలేజీ స్థలాన్ని ఎలా ఇస్తారు?



మెడికల్ కాలేజీలోని స్థలాన్ని షాపులకు ఎలా ఇస్తారు. దీన్ని పూర్తిగా మేము వ్యతిరేకిస్తున్నాం. కర్నూలు బోధనాసుపత్రి రాయలసీమలోనే అతి పెద్దది. ప్రతిరోజూ మూడు వేల మంది ఓపీకి వస్తుంటారు. 1250 మంది వైద్య విద్యార్థులు, 300 మందికి పైగా డాక్టర్లు పని చేస్తుంటారు. ఇంత పెద్దాసుపత్రికి వసతులు, సౌకర్యాల కోసం స్థలం ఎంతో అవసరం. ఎన్ఎంసీ నిబంధనల ప్రకారం విద్యార్థులకు భవనాలు, తరగతులు, కామన్ రూములు ఎంతో అవసరం. కాలేజీ అవసరాలకు రాకుండా బయటి షాపులకు స్థలాన్ని ఇస్తే వైద్యులు, జూనియర్ డాక్టర్లను కలుపుకుని ఉద్యమిస్తాం. కాలేజీని కాపాడుకుంటాం.

- డాక్టర్ బ్రహ్మజీ మాస్టర్, అధ్యక్షులు, ఏపీ ప్రభుత్వ వైద్యుల సంఘం

సమ్మెలోకి వెళ్తాం



కాలేజీ స్థలాన్ని బయటి సంస్థలు, బయటి వ్యక్తులకు అప్పగిస్తే సహించేది లేదు. ఇప్పటికే ఆసుపత్రి మెడికల్ కాలేజీ మెన్స్ హాస్టల్ రోడ్డు వెడల్పు పేరుతో చాలా స్థలాన్ని కోల్పోయాం. కాలేజీ ఇన్‌గేట్ దగ్గర ఉన్న ఖాళీ స్థలాన్ని షాపులకు ఇస్తే జూనియర్ డాక్టర్లందరూ విధులు బహిష్కరించి సమ్మెలోకి వెళ్తాం. ఆందోళనలు చేపడుతాం. ఈ విషయంపై ప్రిన్సిపాల్‌ను కలిసి మా అభిప్రాయాన్ని వ్యక్తం చేసి వినతి పత్రం సమర్పించాం.

- డాక్టర్ జగదీష్, అధ్యక్షుడు, ఏపీ జూడాల సంఘం, కర్నూలు జీజీహెచ్

బాల్య వివాహాలను అరికట్టాలి

కర్నూలు లీగల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు చేయడం దురాచారమని.. దాన్ని అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కర్నూలు జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.కబర్ది కోరారు. బాల్య వివాహాల విముక్త భారత్ ప్రచారంలో భాగంగా బుధవారం స్థానిక న్యాయ సేవాసదన్ భవన్‌లో ఒక అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాలు బాలికల విద్య, రక్షణ, ఆరోగ్యం, అభివృద్ధికి ఆటంకంగా మారిపోతాయని తెలిపారు. ఆ తర్వాత జిల్లా కోర్టు ఆవరణ నుంచి కొండారెడ్డి బురుజు వరకు ర్యాలీ నిర్వహించి అక్కడ మానవహారాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటలక్ష్మి, సీడీపీవో అనురాధ, గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ స్నేహలత, కర్నూలు డీసీపీవో శారద, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ జుబేదా బేగంలతో పాటు పలువురు ఎన్జీవోలు, విద్యార్థులు, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.



బాల్య వివాహాల వ్యతిరేక ర్యాలీని ప్రారంభిస్తున్న జిల్లా న్యాయ ప్రధాన అధికారి జి.కబర్ది

మఠం హుండీ లెక్కింపు ప్రారంభం

మొదటి రోజు ఆదాయం రూ.3.56 కోట్లు

మంత్రాలయం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం మఠం 31 రోజులకు సంబంధించిన హుండీ ఆదాయం లెక్కింపును బుధవారం ప్రారంభించినట్లు మఠం ఏఏఓ మాధవశెట్టి, మేనేజర్లు వెంకటేష్ జోషి, శ్రీపతి ఆచార్‌లు తెలిపారు. అక్టోబరు 26వ తేదీ నుంచి నవంబరు 26 రోజులకు సంబంధించిన 31 రోజుల హుండీని మఠం గురురాజాంగణ భవనంలో దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో లెక్కించినట్లు తెలిపారు. మొదటి రోజు లెక్కింపులో రూ.3,56,32,674 నగదు వచ్చినట్లు చెప్పారు. ఇందులో 174.500 గ్రాముల బంగారు, 1.270 కేజీల వెండి ఆభరణాలు భక్తులు సమర్పించారని తెలిపారు. రెండో రోజు గురువారం హుండీ లెక్కింపు కొనసాగుతుందని పేర్కొన్నారు. హుండీ లెక్కింపులో ఎస్టేట్ అధికారి శ్రీనివాసరావు, సూపరింటెండెంట్‌లు అనంత పురాణిక్, రవి కులకర్ణి, విజయేంద్ర ఆచార్, ఆడిటర్ మోహన్‌రావు, జేసీ స్వామి, కృష్ణమూర్తి, గిరిధర్, సుజ్ఞానేంద్ర, గురురాజ్‌లు పాల్గొన్నారు.



హుండీని లెక్కింపును పరిశీలిస్తున్న దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు

బ్యాలెట్ ఓటింగ్ ప్రజా ప్రయోజన వ్యాజ్యం కొట్టివేత

ఈవీఎంలపై విమర్శలు చేయవద్దు : కలెక్టర్

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): భారత ఎన్నికల్లో పేపర్ బ్యాలెట్ విధానాన్ని పునఃప్రవేశపెట్టాలని కోరుతూ దాఖలైన ప్రజాహిత వ్యాజ్యాన్ని సుప్రీంకోర్టు కొట్టివేసినట్లు జిల్లా కేంద్రానికి ఉత్తర్వులు అందాయని కలెక్టర్ పి.రంజిత్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈవీఎం ట్యాంపరింగ్ పై పిటిషనర్ డాక్టర్ కేఏ పాల్ చేసిన వాదనలను న్యాయస్థానం తిరస్కరించిందన్నారు. పిటిషన్‌ను తిరస్కరించిన సందర్భంగా న్యాయస్థానం కీలక వాఖ్యలుచేసింది. ఎన్నికలలో ఓడిపోయినప్పుడు మాత్రమే ఈవీఎంల విశ్వసనీయతను ప్రశ్నించే నాయకుల అస్థిరతను ఎత్తిచూపింది. పిటిషనర్ వాదనల్లో ఎలాంటి మెరిట్‌ను కనుగొనలేదని, ఎన్నికల్లో ఈవీఎంల వ్యవస్థతో రాజకీయ పార్టీలకు ఎలాంటి ఇబ్బంది లేదని జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ పీబీ వరాలేతో కూడిన ధర్మాసనం స్పష్టం చేసిందని కలెక్టర్ వెల్లడించారు. సుప్రీం కోర్టు ధర్మాసనం తీర్పు ఇచ్చిన నేపథ్యంలో ఎవరూ ఈవీఎంలపై విమర్శలు చేయొద్దని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలియజేశారు. ఎవరైనా ఈవీఎంలపై అనవసరమైన ఆరోపణలు చేస్తే చర్యలు తప్పవన్నారు.

మాజీ ఎమ్మెల్యేపై మంత్రి టీజీ భరత్ వాంగ్మూలం

కర్నూలు లీగల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కర్నూలు మాజీ ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ తన పరువుకు భంగం కలిగించేలా ప్రకటనలు ఇచ్చారంటూ రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ బుధవారం కర్నూలు కోర్టులో వాంగ్మూలం ఇచ్చారు. 2023 ఆగస్టు 3న నాటి ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ఎగ్జిబిషన్ సొసైటీ అధ్యక్షుడిగా తాను నిధులను దుర్వినియోగం చేసినట్లు తప్పుడు ప్రకటనలు ఇచ్చి తన పరువుకు భంగం కలిగించారని మంత్రి టీజీ భరత్ గతంలో కోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు. ఈ పిటిషన్ బుధవారం విచారణకు వచ్చింది. ఈ పిటిషన్‌లో ఆయన ఈ మేరకు స్థానిక ఎక్సైజ్ కోర్టు మేజిస్ట్రేట్ సరోజనమ్మ ముందు వాంగ్మూలం ఇచ్చారు. మంత్రి ఇచ్చిన వాంగ్మూలాన్ని కోర్టు నమోదు చేసి తదుపరి విచారణకు కేసును డిసెంబరు 16కు వాయిదా వేశారు.

బాల్య వివాహ విముక్త్ కోసం కృషి

కలెక్టర్ పి.రంజిత్ బాషా



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ పి.రంజిత్ బాషా

కర్నూలు కలెక్టరేట్ నవంబరు 27, (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహ విముక్త్ భారత్ కోసం ప్రతి ఒక్కరూ సమష్టిగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా పిలుపునిచ్చారు. బుధవారం కలెక్టరేట్ క్యాంపు కార్యాలయంలో బాల్య వివాహ విముక్త్ భారత్‌కు సంబంధించిన పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 18 సంవత్సరాలలోపు అమ్మాయిలకు, 21 సంవత్సరాలలోపు అబ్బాయిలకు వివాహాలు చేయడం చట్టవిరుద్ధమన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ బి.నవ్య, ఐసీడీఎస్ పీడీ వెంకటలక్ష్మి, డీసీపీవో శారద, ఆర్గనైజర్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రూ.30 కోట్లతో రాజగోపురాల నిర్మాణం

ఫిబ్రవరిలో ప్రారంభానికి సన్నాహాలు

మంత్రాలయం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఉరుకుంద లక్ష్మీనరసింహ స్వామి క్షేత్రంలో రూ.30 కోట్లతో నాలుగు రాజగోపురాలు, ధ్వజస్తంభం, గణపతి, నవగ్రహ విగ్రహాల ప్రారంభానికి సిద్ధం చేస్తున్నట్లు దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ విజయరాజు తెలిపారు. బుధవారం రాఘవేంద్రస్వామి మఠం అభివృద్ధిపై చర్చించారు. అనంతరం రాఘవేంద్రస్వామికి దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు రాఘవేంద్రస్వామి మెమెంటో, శేషవస్త్రం, ఫలపుష్ప మంత్రాక్షితలు ఇచ్చి ఆశీర్వదించారు. కార్యక్రమంలో మేనేజర్లు వెంకటేశ్ జోషీ, శ్రీపతాచార్, ప్రధాన అర్చకులు ఈరప్ప, మహాదేవప్ప, బూదన్న తదితరులు పాల్గొన్నారు.



దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్‌తో ఏఏవో మాధవశెట్టి, ప్రధాన అర్చకులు

ఉల్లి ఎగుమతులకు బ్రేక్

- పశ్చిమ బెంగాల్ వద్ద సరిహద్దులు మూసివేత
- ఎక్కడికక్కడే ఉల్లి లారీలను నిలిపివేసిన వైనం
- రూ.5వేల నుంచి రూ.మూడున్నర వేలకు పతనం


కర్నూలు మార్కెట్ యార్డులో అమ్మకానికి వచ్చిన ఉల్లి

కర్నూలు అగ్రికల్చర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఈ రైతు పేరు సీమోన్. జులేకల్ గ్రామానికి చెందిన ఈయన 15 బస్తాల ఉల్లిని బుధవారం అమ్మకానికి కర్నూలు మార్కెట్ యార్డుకు తీసుకువచ్చాడు. మూడు రోజుల నుంచి మార్కెట్ యార్డులకు ఉల్లి విక్రయానికి తక్కువగా వస్తున్నందున ధర బాగా పలుకుతుందని ఆశించాడు. అయితే.. చావు కబురు చల్లగా చెప్పారు. ఇప్పటి దాకా విదేశాలకు సప్లయ్ అవుతున్న ఉల్లి ఎగుమతులు ఆగిపోయాయని వ్యాపారులు చెప్పారు. బంగ్లాదేశ్‌కు ఉల్లి లారీలు ఎగుమతి కాకుండా కేంద్ర ప్రభుత్వం పశ్చిమ బెంగాల్ వద్ద లారీలను నిలిపివేసింది. దీంతో కర్నూలు మార్కెట్ యార్డు నుంచి ఉల్లి ఎగుమతులకు బ్రేక్ పడింది. మొన్నటి దాకా రూ.4వేల నుంచి రూ.5వేల దాకా క్వింటం ఉల్లి అమ్ముడుపోయింది. ఎగుమతులు ఆగిపోయాక ఒక్కసారిగా క్వింటంపై రూ.1000 దాకా ధర తగ్గిపోయిందని రైతులు ఆవేదన చెందుతున్నారు. కర్నూలు, నంద్యాల జిల్లాలతో పాటు అనంతపురం, తెలంగాణ రాష్ట్రంలోని మహబూబ్ నగర్ జిల్లాల నుంచి కర్నూలు యార్డుకు ఉల్లిని తీసుకువస్తున్న రైతులు దీని వల్ల తీవ్రంగా నష్టపోతున్నారు

మహారాష్ట్రలో భారీ వర్షాల కారణంగా ఉల్లి పంట దిగుబడి తగ్గిపోవడంతో కర్నూలు, నంద్యాల జిల్లాల ఉల్లికి గతంలో ఎన్నడూ లేని విధంగా డిమాండ్ పెరిగింది. 10వేల క్వింటాళ్ల ఉల్లి విక్రయానికి వచ్చినా గరిష్ఠ ధర రూ.4500 నుంచి రూ.5వేల వరకు ధర అందింది. అయితే కేంద్ర ప్రభుత్వం ఉల్లి ధరను నియంత్రించేందుకు వివిధ రాష్ట్రాల నుంచి బంగ్లాదేశ్ తదితర దేశాలకు ఎగుమతి చేసే ఉల్లిపై నిషేధం విధించింది. దీంతో ఉమ్మడి జిల్లా నుంచి సప్లయ్ అవుతున్న ఉల్లి లారీలను ఎక్కడికక్కడ నిలిపివేశారు. ఈ పరిణామం వల్ల ప్రస్తుతం కర్నూలు మార్కెట్ యార్డుకు కేవలం రూ.2వేల నుంచి రూ.3వేల క్వింటాళ్లు మాత్రమే అమ్మకానికి వస్తున్నది.

కనీస స్థాయికి ధర పతనం:

గత శుక్రవారం క్వింటం ఉల్లికి గరిష్ఠ ధర రూ.5,099. బుధవారం రూ.4వేల గరిష్ఠ ధర నుంచి రూ.500 కనిష్ఠ ధరకు పడిపోయింది. రానున్న రోజుల్లో మరింతగా ధర పడిపోవచ్చని రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

ఉల్లి ఎగుమతులు నిలిచిపోయాయి



ఇప్పటి దాకా గతంలో ఎన్నడూ లేని విధంగా కర్నూలు యార్డులో ఉల్లికి మంచి ధర లభించింది. అయితే.. బంగ్లాదేశ్‌కు ఉల్లిని ఎగుమతి నిషేధించారని వ్యాపారులు చెబుతున్నారు. ఈ నిషేధం ఎంత వరకు ఉంటుందో చెప్పలేం. మహారాష్ట్ర నుంచి వివిధ రాష్ట్రాలకు ఇప్పుడిప్పుడే ఉల్లిని ఆ రాష్ట్ర రైతులు తీసుకుని వస్తున్నారు. దీనివల్ల కర్నూలు మార్కెట్ యార్డులో ఉల్లికి ధర ఏ స్థాయిలో అందుతుందో చెప్పలేని పరిస్థితి ఏర్పడింది. ఏది ఏమైనా రైతుకు గిట్టుబాటు ధర అందించేందుకు చర్యలు తీసుకుంటాం. - **జయలక్ష్మి, సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ**

ఎక్సైజ్ పోలీసులకు పరామర్శ

కర్నూలు అర్బన్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఎక్సైజ్ సీఐ సుభాషిణి, ఎస్ఐ మారుతీప్రసాద్, హెడ్ కానిస్టేబుల్ వెంకట రాముడు, మరో కానిస్టేబుల్‌ను ఎక్సైజ్‌శాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీదేవి, అసిస్టెంట్ కమిషనర్ హనుమంతరావు, సూపరింటెండెంట్ సుధీర్ కుమార్ పరామర్శించారు. బుధవారం ఎక్సైజ్ ఎన్ఫోర్సుమెంట్ విభాగంలోని పని చేస్తున్న సదరు సీఐ తన బృందంతో సారా, అక్రమ మద్యానికి సంబంధించి దాడుల నిమిత్తం వెళ్తుండగా జిల్లాలోని పత్తికొండ పరిధిలో జీపు బోల్తా పడింది. ఈ ఘటనలో పలువురికి గాయాలు కాగా, సీఐ, హెచ్ కానిస్టేబుల్‌కు తీవ్రగాయాలయ్యాయని సీఐ చంద్రహాస్ తెలిపారు.

మహిళలతో అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తికి జైలు

నంద్యాల క్రైం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మహిళలతో అసభ్యకరంగా ప్రవర్తించిన నంద్యాల పట్టణానికి చెందిన ఎస్.కరీముల్లా అనే వ్యక్తికి ఏడు రోజుల జైలు శిక్ష పడినట్లు వన్‌టౌన్ సీఐ జి.సుధాకర్‌రెడ్డి బుధవారం తెలిపారు. కరీముల్లా మహిళలపట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడన్న ఫిర్యాదు మేరకు పోలీసులు అతడిని పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి నంద్యాల సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరిచారు. న్యాయస్థానం 7రోజుల జైలు శిక్ష విధించినట్లు సీఐ వెల్లడించారు. ఈ మేరకు అతడిని నంద్యాల జైల్‌కు తరలించినట్లు తెలిపారు.

టైరు పగిలి కారు బోల్తా

- ఎక్సైజ్ సీఐ, హెడ్‌కానిస్టేబుల్‌కు తీవ్ర గాయాలు


ధ్వంసమైన కారును పరిశీలిస్తున్న సీఐ

దేవనకొండ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): టైరు పగిలి కారు బోల్తా పడిన ఘటనలో ఎక్సైజ్ సీఐ, హెడ్‌కానిస్టేబుల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. దేవనకొండ- పత్తికొండ రహదారిపై వెలమకూరు సమీపంలో బుధవారం ఈ ప్రమాదం చోటు చేసుకొంది. ఏపీ ఎన్ఫోర్స్‌మెంట్ ఎక్సైజ్ సీఐ సుభాషిణి తమ సిబ్బందితో కలిసి తుగ్గలి మండలం జొన్నగిరి వద్ద తనిఖీలకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో దేవనకొండకు మూడు కిలోమీటర్ల దూరంలో టైరు పగలడంతో కారు అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో ఎక్సైజ్ సీఐ సుభాషిణి, హెడ్ కానిస్టేబుల్ వెంకట్రాముడు తీవ్రంగా గాయపడ్డారు. ఎస్ఐ మారుతి, డ్రైవర్ వంశీలతోపాటు మరొకరికి స్వల్ప గాయాలతో బయటపడ్డారు. రోడ్డు శిథిలమై గుంత ఏర్పడటంతో వేగంగా వెళ్తున్న కారు టైరు అందులోపడి పగిలిపోయింది. దీంతో కారు అదుపుతప్పి వేగంలో పల్టీలు కొట్టి హంద్రీనీవా కాలువలోకి దుసుకెళ్లింది. ప్రమాద సమయంలో అద్దాలు ధ్వంసమై అందులో నుంచి సీఐ సుభాషిణి గాల్లో ఎగిరిపడిన్నట్లు సమీప పొలాల రైతులు తెలిపారు. క్షతగాత్రులను స్థానిక వైద్యశాలకు, మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు అంబులెన్స్‌లో తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

భార్యను హత్య చేసిన భర్త

తుగ్గలి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): భార్యపై అనుమానంతో భర్త కొడవలితో గొంతు కోసి హత్య చేశాడు. ఈ ఘటన మండల పరిధిలోని రాంపల్లిలో బుధవారం జరిగింది. పోలీసుల వివరాల మేరకు.. రామలింగాయపల్లెకు చెందిన పెద్దయ్య, రామాంజినమ్మల కుమార్తె సరోజ(35)ను రాంపల్లికి చెందిన ఓబులయ్య, కాశమ్మల రెండో కుమారుడు రామానాయుడుకు 18 ఏళ్ల క్రితం ఇచ్చి వివాహం చేశారు. వీరికి ఇద్దరు కుమారులు సంతానం. గత కొన్నేళ్ల క్రితం భార్యాభర్తలు మనస్పర్థలతో విడిపోయి ఎవరికి వారు జీవనం చేస్తున్నారు. సరోజ అదే గ్రామంలోనే సొంత ఇల్లు కొనుగోలు చేసి బట్టల షాపు పెట్టుకుని జీవనం చేస్తుండేది. అయితే సరోజపై అనుమానం పెంచుకున్న భర్త రామానాయుడు ఇంట్లోనే గొంతు నరికి హత్య చేశాడు. విషయం తెలుసుకున్న పత్తికొండ రూరల్ సీఐ పులిశేఖర్, తుగ్గలి ఎస్ఐ కృష్ణమూర్తి సిబ్బందితో గ్రామానికి చేరుకున్నారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించి హత్యకు గల కారణాలు విచారణ చేపట్టారు. మృతురాలు సోదరుడు సురేంద్ర ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నామని, నిందితుడు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

ఉరి వేసుకుని మహిళ ఆత్మహత్య

నందవరం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని కనకవీడు గ్రామంలో సోమమ్మ(44) బుధవారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఎస్ఐ శ్రీనివాసులు వివరాల మేరకు.. కనకవీడు గ్రామానికి చెందిన కురవ నరసింహ భార్య సోమమ్మ కొన్ని రోజులుగా కడుపు నొప్పితో బాధపడుతోంది. కర్నూలు ఆసుపత్రికి తీసుకెళ్లగా క్యాన్సర్ అని డాక్టర్లు తెలిపారు. దీనికితోడు తీవ్రమైన కడుపు నొప్పి రావడంతో ఆ నొప్పి భరించలేక ఇంట్లో చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. పెద్ద కుమారుడు శ్రీనివాసులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు

హొళగుంద, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): హొళగుంద లోని నాయిబ్రాహ్మణ వీధికి చెందిన ఈడిగ విరూపాక్షి అనే రైతు పొలంలో విద్యుదాఘానికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన బుధవారం జరిగింది. పొలంలో వరి నారు మడి వేసేందుకు ట్రాక్టర్‌తో దుక్కి పనులు చేస్తుండగా ట్రాక్టర్‌కు అడ్డంగా ఉన్నాయని విద్యుత్ తీగలను తొలగిస్తుండగా కరెంట్ షాక్ తగిలి తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం బళ్లారికి తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

అక్రమార్కులను వదిలేది లేదు

- కార్యకర్తలే టీడీపీకి వెన్నుదన్ను
- శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి

ఆత్మకూరు రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల వైసీపీ పాలనలో అధికారాన్ని అడ్డుపెట్టుకుని అక్రమాలు చేసిన వారిని వదిలే ప్రసక్తే లేదని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి హెచ్చరించారు. బుధవారం ఆత్మకూరు పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నియోజకవర్గ టీడీపీ శ్రేణులతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వచ్చిన రెండు నెలల్లోనే నియోజకవర్గానికి రూ.25 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామన్నారు. త్వరలోనే పట్టణంలో మిని రింగ్ రోడ్డు కోసం, నాన్ అమృత్ స్కీం, మున్సిపాలిటీ అభివృద్ధికి సీఎం చంద్రబాబును ఒప్పించి నిధులు సమీకరిస్తానని తెలిపారు. గత వైసీపీ హయాంలో ఐదేళ్ల పాలనంతా ఆర్భాటాలే తప్ప ఆచరణ లేదని మండిపడ్డారు. సంక్షేమం, అభివృద్ధి ఎక్కడా కనిపించనప్పటికీ రూ.12లక్షల కోట్లు అప్పులు కావడంతో రాష్ట్రం సర్వనాశనమైందని ఆవేదన వ్యక్తం చేశారు. తమ హయాంలో పంపిణీ చేసిన ఇళ్ల పట్టాలను రద్దు చేసి జగనన్న కాలనీలుగా మార్చుకోవడం సిగ్గుచేటని విమర్శించారు. ఇళ్లపట్టాలు కోల్పోయిన లబ్ధిదారులందరికి ఇళ్లపట్టాలను అందజేసే బాధ్యత తనదని స్పష్టం చేశారు. టీడీపీకి కార్యకర్తలే బలమన్నారు. కష్టకాలంలో కష్టపడిన కార్యకర్తలకు గుర్తింపు, గౌరవం ఉంటుందన్నారు. టీడీపీ సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలన్నారు. డిసెంబర్ 7న ఆత్మకూరులో జరిగే తబ్లిగీ ఇజితెమాకు పూర్తి సహకారం ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బన్నూరు రామలింగారెడ్డి, గోవిందరెడ్డి, వంగాల శివరామిరెడ్డి, తిరుపమయ్య, వేణుగోపాల్, శివప్రసాద్‌రెడ్డి, అబ్దుల్లాపురం బాషా, రాజేంద్రరెడ్డి, గౌస్‌లాజం, కలిముల్లా, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

నేరాల నివారణపై అవగాహన

నంద్యాల క్రైం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మహిళా సంబంధిత నేరాలు, గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్, సైబర్ క్రైం, డ్రగ్స్, లోన్‌యాప్ మోసాలు, రోడ్డు భద్రతా నియమాలపై పాఠశాలల విద్యార్థులకు పోలీస్ అధికారులు అవగాహన సదస్సులు నిర్వహించారు. ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా బుధవారం ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లోని విద్యార్థినీ, విద్యార్థులకు పోలీస్ అధికారులు అవగాహన సదస్సులు నిర్వహించారు. డ్రగ్స్, మహిళలపై జరిగే అఘాయిత్యాలు, బాలికల సంరక్షణ చట్టం,సైబర్ క్రైం,రహదారి భద్రత నియమాలపై వివరించారు. ఆడపిల్లలు, మహిళలు ఏదైనా ఆపదలో ఉన్నట్లయితే డయల్ 100 లేదా 112కు ఫోన్ చేస్తే పోలీసులు తక్షణమే స్పందిస్తారని చెప్పారు. ఎవరైనా సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోతే వెంటనే 1930కి ఫోన్ చేసి సహాయం పొందవచ్చని తెలిపారు.

సెల్ఫీ వీడియో తీసుకుంటూ
యువకుడి ఆత్మహత్యాయత్నం

- కాపాడిన ఎస్‌బీ ఎస్ఐ వేణుగోపాల్ రాజు


చికిత్స పొందుతున్న విద్యార్థిని పరామర్శిస్తున్న ఎస్‌బీ ఎస్ఐ

ఎమ్మిగనూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఓ యువకుడు సెల్ఫీ తీసుకుంటూ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన బుధవారం ఎమ్మిగనూరు పట్టణంలోని ఎద్దుల మార్కెట్ సమీపంలో చోటు చేసుకుంది. ఎస్‌బీ పోలీసులు తెలిపిన సమాచారం మేరకు.. ఎమ్మిగ నూరు మండలం కడివెళ్ల గ్రామానికి చెందిన రాముడు పట్టణం లోని ఓ ప్రైవేటు డిగ్రీ కళాశాలలో తృతీయ సంవత్సరం డిగ్రీ చదువుతున్నాడు. అయితే వ్యక్తిగత సమస్యలతో జీవితంపై విరక్తి చెంది సెల్ఫీ తీసుకుంటూ విషం తాగి ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నించాడు. ఈ వీడియో కాస్తా కర్నూలులోని ఎస్‌బీ ఎస్ఐ వేణుగోపాల్ రాజుకు చేరింది. ఎస్ఐ వెంటనే విద్యార్థి రాముడు లోకేషన్ కోసం సైబర్ ల్యాబ్ టెక్నికల్ పోలీసుల సహాయంతో సాంకేతిక నైపుణ్యంతో గుర్తించారు. విద్యార్థి రాముడు స్నేహితులు, బంధువులను అలర్ట్ చేయటంతో చేరుకొని కాపాడారు. ఎమ్మిగనూరు లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించి ప్రాణాపాయం నుంచి కాపాడారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థి రాముడును ఎస్‌బీ ఎస్ఐ వేణుగోపాల్ రాజు పరామర్శించారు. కాగా సమాచారం అందిన వెంటనే చాకచక్యంగా విద్యార్థిని కాపాడిన స్పెషల్ బ్రాంచ్ ఎస్ఐ వేణుగోపాల్ రాజును ఎస్పీ బిందుమాధవ్ అభినందించారు.

వివాహ వేడుకలో విషాదం


బాలుడి మృతికి కారణమైన డీజే వాహనం, ఇన్‌సెట్‌లో మనోజ్(ఫైల్)

- బాలుడి తలపై ఎక్కిన డీజే వాహనం
- అక్కడికక్కడే దుర్మరణం
- సజ్జలగుడ్డం గ్రామంలో ఉద్రిక్తత

కోసిగి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కోసిగి మండలంలోని సజ్జలగుడ్డం గ్రామంలో వివాహ వేడుకలో బుధవారం విషాదం చోటు చేసుకుంది. పెళ్లి పూర్తయి మెరవణి కోసం ఏర్పాటు చేసిన డీజే వాహనం కింద పడి మనోజ్(7)అనే బాలుడు మృతి చెందాడు. ఇందుకు సంబంధించిన వివరాలు... సజ్జల గుడ్డం గ్రామానికి చెందిన ఆర్లబండ నాగేష్ కుమారుడు బసవరాజు వివాహం బుధవారం ఉదయం జరగడంతో రాత్రి 8 గంటలకు మెర వణి నిర్వహించారు. కౌతాళం మండలం ఎరిగేరి గ్రామానికి చెందిన వివాహ గుర్రాల బండి, డీజే వాహనాలను తీసుకువచ్చారు. ఈ క్రమంలో వాహనాలు అదుపుతప్పి వెనుక వైపు నుంచి బాలుడు కురువ మనోజ్‌పైకి వెళ్లాయి. దీంతో బాలుడి తలభాగం దెబ్బ తిని అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో కోపోద్రిక్తులైన బాలుడి కుటుంబ సభ్యులు పెళ్లి వాహనాల అద్దాలను ధ్వంసం చేశారు. ఈ ఘటనతో డ్రైవర్లు, వాహన యజమానులు అక్కడి నుంచి పరారయ్యారు. కొద్దిసేపు గ్రామంలో ఉద్రిక్తత పరిస్థితి ఏర్పడింది. సమా చారం తెలుసుకున్న ఎస్ఐ చంద్రమోహన్ సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు అడిగి తెలుసుకున్నారు.

బాలుడి మృతికి కారణమైన పెళ్లి వాహనాలను కోసిగి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. బాలుడి తల్లిదండ్రులు గోరంట్ల చంద్ర, శారదమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చంద్రమోహన్ తెలిపారు. కాగా బాలుడు స్థానికంగా ప్రభుత్వ పాఠశాలలో ఒకటో తరగతి చదువుతున్నాడు.

అందుబాటులో ఇసుక డిపోలు

నంద్యాల కల్చరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఆళ్లగడ్డ, బనగానపల్లె, నందికొట్కూరు, నంద్యాల ప్రాంతాల్లో వినియోగదారుల నిమిత్తం ఇసుక డిపోలను ప్రవేటు వ్యక్తుల ఆధ్వర్యంలో ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి జిల్లాస్థాయి ఇసుక కమిటీ నంద్యాల నిర్ణయం తీసుకున్నట్లు కలెక్టర్ రాజకుమారి తెలిపారు. ప్రభుత్వ ధరకు సరఫరా చేయడానికి గనుల శాఖ మినరల్ డీలర్ లైసెన్సు మంజూరు చేశారు.

డిపోల వివరాలు:

ఆళ్లగడ్డలో సర్వే నెంబరు 113-2, పాలసాగరం గ్రామం ప్రాంతంలో రామశేఖర్‌రెడ్డి, బనగానపల్లెలో సర్వే నెంబరు 142, 143 మార్కెట్ యార్డు బనగానపల్లెలో మద్దూరు రవి ఇసుక డిపోలు నిర్వహిస్తారని చెప్పారు. నందికొట్కూరులో సర్వే నెంబరు 383,384లో ఆవుల బాల వెంకట సురేష్, నంద్యాల మండలంలో సర్వే నెంబరు 457-3 అయ్యలూరులో ఇసుక డిపో నిర్వహి స్తారని తెలిపారు. ఆళ్లగడ్డలో ఇసుక టన్ను ధర రూ.719, బనగానపల్లెలో, నందికొట్కూరు ప్రాంతాలలో ఇసుక టన్ను ధర రూ.744, నంద్యాలలో ఇసుక టన్ను ధర రూ.884గా ప్రభుత్వం నిర్ణయించింది.

ఇద్దరు రోగులకు పోయమ్ ఎండోస్కోపీ

- రాయలసీమలో మొట్టమొదటిసారి అంటున్న వైద్యులు


రోగికి పోయం ఎండోస్కోపి చికిత్స చేస్తున్న వైద్యులు

కర్నూలు హాస్పిటల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): అన్నవాహిక జబ్బు అకలేషియా కార్డియో సమస్య ఉన్న ఇద్దరు రోగులకు కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్యులు పోయమ్ (పీఓఈఎం) ఎండోస్కోపిక్ చికిత్సను బుధవారం విజయవంతంగా నిర్వహించారు. జయంతి (45), బీసేంద్ర (47) అనే ఇద్దరు రోగులకు గత రెండు మూడేళ్లుగా ఆహారం మింగడానికి ఇబ్బంది పడుతున్నారు. దీంతో ఈ ఇద్దరు రోగులు కర్నూలు జీజీహెచ్‌లోని గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగానికి వచ్చారు. ఆ విభాగపు హెచ్‌వోడీ డా.జి. మోహన్‌రెడ్డి పరీక్షలు నిర్వహించగా అన్నవాహిక కింద భాగాన పుట్టుకతో కండరం గట్టి పడినట్లు గుర్తించారు. దీని వల్ల తిన్న ఆహారం మింగలేకపోతున్నట్లు ఆయన గుర్తించారు. దీంతో ఈ ఇద్దరు రోగులకు బుధవారం ఉదయం గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగంలోని ఈఆర్‌సీపీ ఓటీలో హెచ్‌వోడీ డా.జి. మోహన్ రెడ్డి, సీనియర్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డా.బి. శంకర్‌శర్మతో కలిసి యశోద హాస్పిటల్‌కు చెందిన గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డా. రాకేష్ కుమార్ పోయమ్ ఎండోస్కోపిక్ ద్వారా చికిత్స విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్యాస్ట్రో ఎంట్రాలజీ హెచ్‌వోడీ డా.జి. మోహన్ రెడ్డి మాట్లాడుతూ అకలేషియా కార్డియో సమస్యకు పోయమ్ చికిత్స చేయడం రాయలసీమలో ప్రప్రథమమని అన్నారు. ఈ చికిత్సలో గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టులు డా. ప్రవీణ్ కుమార్, డా. దీపక్ రెడ్డి, డా. సుజిత్ రెడ్డి, డా. సంపత్, డా. ఆర్షియా, సీనియర్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డా. సాయికుమార్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా'సివిల్స్' కోచింగ్ ప్రవేశ పరీక్ష

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కర్నూలు నగరంలోని అబ్బాస్ నగర్‌లోని ఆంధ్రప్రదేశ్ బీసీ స్టడీ సర్కిల్‌లో బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు సివిల్ సర్వీసెస్ ఉచిత కోచింగ్ ప్రవేశ పరీక్ష బుధవారం ప్రశాంతంగా జరిగింది. కర్నూలు, నంద్యాల జిల్లాల్లో మొత్తం 50 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఈ పరీక్షకు 47 మంది అభ్యర్థులు హాజరు కాగా, ముగ్గురు గైర్హాజరయ్యారు. ఈ పరీక్ష కేంద్రాన్ని డీబీసీడబ్ల్యూఓ వెంకటలక్ష్మమ్మ పర్యవేక్షించారు. రాష్ట్ర స్థాయిలో మెరిట్ ప్రాతిపదికన అభ్యర్థులను ఎంపిక చేస్తారన్నారు. ఎంపికైన అభ్యర్థులకు విజయవాడలో సివిల్ సర్వీస్ కోసం రెసిడెన్షియల్ కోచింగ్ ఉచిత శిక్షణ అందించనున్నట్లు తెలిపారు.

నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

సర్వీసు రోడ్డు నిర్మించాలి

● జాతీయ రహదారి పనులను అడ్డుకున్నరైతులు


తాటిపాడువద్ద జాతీయ రహదారి పనులను అడ్డుకున్న రైతులు

జూపాడుబంగ్లా, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారికి ఇరువైపుల సర్వీస్ రోడ్డు నిర్మించాలని బుధవారం తాటిపాడు గ్రామానికి చెందిన రైతులు పనులను అడ్డుకుని ధర్నా చేశారు. మట్టి చదును చేస్తున్న వాహనాలను అడ్డుకున్నారు. సర్వీస్ రోడ్డు నిర్మించకపోతే కిలోమీటర్లు వెళ్లి తిరిగి రావాల్సి వస్తుందని చెప్పారు. తాటిపాడు వద్ద జరుగుతున్న జాతీయ రహదారికి ఇరువైపుల రక్షణ గోడలు నిర్మించాలని డిమాండు చేశారు. అలాగే ప్రస్తుతం గ్రామ పంచాయతీ రోడ్డు భారీ వాహనాల రాకపోకలకు పాడైపోయిందని, మరమ్మతులు చేయాలని డిమాండ్ చేశారు. కంపెనీ ప్రతినిధులు ధర్నా చేస్తున్న రైతులతో మాట్లాడారు. ఈ విషయాన్ని కంపెనీ యాజమాన్యానికి పంపిస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ధర్నా విరమించారు. తాటిపాడు సర్పంచ్ లక్ష్మీదేవి, మాజీ సర్పంచ్ లక్ష్మన్నగౌడు, గ్రామానికి చెందిన రైతులు వీరారెడ్డి, తిరుమలేశ్వరరెడ్డి, కృష్ణారెడ్డి, ఖాజీకురైషన్, మాబు, మున్నా, వెంకటనారాయణ, రాముడు, ముత్తు, ఖాశీం తదితరులు పాల్గొన్నారు.

అధికారులు మారినా పేర్లు మారలేదు..!

● నోటీసు బోర్డులో పేర్లను తొలగించని వైనం

కొత్తపల్లి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): అధికారులు మారి ఏళ్ల గడుస్తున్నా నోటీస్ బోర్డుపై ఇంకా వారి పేర్లు తొలగించలేదు. కొత్తపల్లి మండలంలోని ఎర్రమఠం గ్రామ సచివాలయంలో ఇంకా వారి పేర్లే దర్శనమిస్తున్నాయి. దీంతో అధికారులెవరో తెలియక సచివాలయానికి వచ్చే ప్రజలు, రైతులు అయోమయానికి గురవుతున్నారు. కొత్తపల్లి ఈవోఆర్డీ శ్రీనివాస నాయుడు బదిలీ అయి రెండేళ్లు దాటింది. ఐదు నెలల క్రితం పదవీ విరమణ కూడా పొందారు. అయినప్పటికీ ఆయన పేరు అలాగే ఉంచారు. అలాగే ఎంపీడీవో చంద్రశేఖర్ బదిలీ అయి నాలుగేళ్లు అయింది. అలాగే గ్రామ పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ కూడా ఇటీవల ఆత్మకూరు మండలంలోని బావనంతాపురం పంచాయతీ కార్యదర్శిగా బదిలీపై వెళ్లారు. అయితే ఈ అధికారుల పేర్లు ఎర్రమఠం సచివాయం నోటీసు బోర్డుపై దర్శనమిస్తున్నాయి. బదిలీపై వెళ్లిన అధికారుల పేర్లు తొలగించి ప్రస్తుత అధికారుల పేర్లు రాయాలని ప్రజలు కోరుతున్నారు.



ఎర్రమఠం సచివాయలం నోటీసు బోర్డులో బదిలీ అయిన అధికారుల పేర్లు

శ్రీగిపై కార్తీక వెలుగులు


ఆకాశ దీపోత్సవాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

శ్రీశైలం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం క్షేత్రంలో కార్తీకమాసోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. కార్తీకమాసం పురస్కరించుకొని భక్తులు అధిక సంఖ్యలో స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. వేకువజాము నుంచే భక్తులు ఆలయ ఉత్తర మాఢవీధిలో, దేవాలయం ఎదురుగా ఉన్న గంగాధర మండపం వద్ద అధిక సంఖ్యలో దీపారాధనలను చేశారు. సాయంత్రం ఆలయ ధ్వజస్తంభం వద్ద ఆకాశ దీపం కార్యక్రమాన్ని నిర్వహించారు.

● లోకకల్యాణార్థం సాక్షి గణపతికి, ఆలయ ప్రాంగణంలోని జ్వాలా వీరభద్రస్వామికి విశేష అభిషేక పూజలు నిర్వహించారు. అభిషేకాన్ని పంచామృతాలతోనూ, పలుఫలోదకాలతోనూ, హరిద్రోదకం, గంధోదకం, పుష్పోదకం, కలశోదకం, శుద్ధజలాలతో అభిషేకాన్ని చేశారు. అనంతరం విశేష పుష్పార్చన, నివేదన కార్యక్రమాలు నిర్వహించారు.

● శ్రీశైల దేవస్థానం ధర్మపథంలో భాగంగా నిర్వహిస్తున్న నిత్యకళారాధన కార్యక్రమంలో బుధవారం కడపకు చెందిన సాయి నటరాజ డాన్స్ అకాడమీ బృందంతో సంప్రదాయ నృత్య ప్రదర్శన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్య కళారాధన వేదిక వద్ద నిర్వహించిన కార్యక్రమంలో గణనాథం, లింగాష్టకం, శివతాండవం, అయిగిరినందిని తదితర గీతాలకు కళాకారులు నృత్యప్రదర్శనతో అలరించారు.

మహానందిలో భక్తుల రద్దీ


దర్శనానికి క్యూ లైన్‌లో నిల్చున్న భక్తులు

మహానంది, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం సందర్భంగా మహానంది ఆలయం బుధవారం భక్తులతో కిటకిటలాడింది. తెలుగు రాష్ట్రాల నుంచే కాక ఇతర రాష్ట్రాల నుంచి దైవదర్శనం కోసం వచ్చిన భక్తులతో పాటు అయ్యప్పమాల స్వీకరించిన భక్తులతో కిటకిటలాడింది. ఆలయం ప్రాంగణం లోని కోనేర్లల్లో భక్తులు కార్తీక పుణ్య స్నానాలు ఆచరించిన తర్వాత మహానందీశ్వరుడిని దర్శించుకున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు మహానంది క్షేత్ర పరిసరాలు భక్తుల శివనామస్మరణతో మార్మోగాయి.

'విజయవంతం చేయాలి'



సమావేశంలో ప్రసంగిస్తున్న వక్త

శ్రీశైలం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో వచ్చే సంవత్సరం జనవరి 5న జరగనున్న హైందవ శంఖారావం సదస్సును విజయవంతం చేయాలని ఆర్ఎస్ఎస్ రాష్ట్ర సభ్యులు యుగంధర్ పిలుపునిచ్చారు. శ్రీశైలంలోని యాంఫీథియేటర్ వద్ద బుధవారం మండల హైందవ సమ్మేళన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి వీహెచ్‌పీ ప్రాంత ఉపాధ్యక్షుడు వై.విష్ణువర్ధన్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి కిశోర్ పలువురు స్వామీజీలు, స్థానికులు హాజరయ్యారు. హిందువులందరూ కలసిమెలసి హిందుత్వాన్ని కాపాడుకోవాలని చెప్పారు. హైందవ శంఖారావం జాతీయస్థాయి ఉద్యమం కాబోతుందన్నారు.

'విద్యార్థులకు చట్టాలపై అవగాహన ఉండాలి'


విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఆత్మకూరు సీనియర్ సివిల్ న్యాయాధికారి

ఆత్మకూరు రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): చట్టాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ఆత్మకూరు సీనియర్ సివిల్ న్యాయాధికారి వెంకటేశ్వరరావు సూచించారు. పట్టణంలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో పాల్గొని ఆయన మాట్లాడారు. విద్యార్థులు తమ హక్కులు, న్యాయ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. బాల్య వివాహాలు చట్ట రీత్యా నేరమని అన్నారు. బాల్య వివాహాలకు వ్యతిరేకంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అడ్వకేట్ మాణిక్యం, వైస్ ప్రిన్సిపాల్ శంకరయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

'యాప్‌లో నమోదు చేసుకోవాలి'



మాట్లాడుతున్న డాక్టర్ యశోదర

నంద్యాల కల్చరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రజలు తమ శరీర ప్రకృతిని తెలుసుకోవడం కోసం దేశ్‌కా ప్రకృతి పరీక్షన్ అభియాన్ యాప్‌లో నమోదు చేసుకోవాలని ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల అధికారి డా.యశోదర సూచించారు. భారత ప్రభుత్వ ఆయూష్ డిపార్ట్‌మెంట్ వారు దేశమంతా పౌరులు తమ శరీర ప్రకృతిని తెలుసుకోవడానికి కోసం దేశ్‌కా ప్రకృతి పరీక్షన్ అభియాన్ అనే కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. పోస్టర్లను విడుదల చేశారు.

రాష్ట్రాభివృద్ధే టీడీపీ లక్ష్యం: ఎమ్మెల్యే


శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గిత్తా జయసూర్య

పాములపాడు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా టీడీపీ పని చేస్తోందని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. పాములపాడులోని ఎస్సీ కాలనీలో బుధవారం టీడీపీ నాయకుడు హరిసర్వోత్తమరావుతో కలసి నూతన అంగన్‌వాడీ భవనాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా బాలింతలకు, గర్భిణులకు చిన్నారులకు పౌష్టికాహారాన్ని అందిస్తోందన్నారు. అలాగే ఇదే గ్రామానికి చెందిన గఫూర్ అనే వ్యక్తికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా 1,13,706 చెక్కును అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా చంద్రబాబు అధికార పగ్గాలు చేపట్టాక పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పలు సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టిన ఘనత ఒక్క టీడీపీకే దక్కిందన్నారు. గడిచిన ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రం అప్పుల కుప్పగా మార్చి దివాళా తీయించారన్నారు. కార్యక్రమంలో మాండ్ర సురేంద్రనాథ్‌రెడ్డి, తిమ్మారెడ్డి, హరినాథరెడ్డి, మధు కృష్ణ, ఏసేపు, గోవిందు, అలిబాషా, మల్లికార్జున, నబీ రసూల్, మద్దిలేటి, లింగస్వామి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'నిధులను ఎంపీ మంజూరు చేయిస్తే.. ఎమ్మెల్యే భూమి పూజ ఎలా చేస్తారు?'


మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

కొత్తపల్లి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): సంగమేశ్వరం నుంచి జానాల గూడెం వరకు విద్యుత్ స్తంభాల ఏర్పాటుకు నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి కేంద్రం నుంచి నిధులు మంజూరు చేయిస్తే.. నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్య ఆ పనులకు భూమి పూజ ఎలా చేస్తారని కొత్తపల్లి మాజీ ఎంపీపీ వెంకటేశ్వర్లు, నీటి సంఘం మాజీ చైర్మన్ చిన్నపుల్లారెడ్డి, మాజీ సొసైటీ చైర్మన్ రామచంద్రారెడ్డి, టీడీపీ నాయకులు నాగశేషన్న ప్రశ్నించారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఎంపీ శబరి నియోజకవర్గంలో లేని సమయంలో ఎమ్మెల్యే హడావుడిగా భూమి పూజ చేయడంలో ఆంతర్యమేమిటి అని ప్రశ్నించారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్ఆర్ఈజీఎస్ కింద మంజూరైన సీసీ రోడ్ల నిర్మాణ పనులను కూడా వైసీపీ నుంచి వచ్చిన వారికే అధిక శాతం కట్టబెట్టడం ఎంత వరకు సమంజసమన్నారు. సంగమేశ్వరం నుంచి జానాల వరకు కూడా బీటీ రోడ్డు నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయించింది కూడా ఎంపీ శబరి అని అన్నారు.

'రైతులే విత్తనాలు తయారు చేసుకోవాలి'

వెలుగోడు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రైతులు తాము పండించే పంటల కోసం తామే స్వయంగా విత్తనాలను ఉత్పత్తి చేసుకోవాలని నంద్యాల డీఆర్సీ ఏవో హేమలత అన్నారు. సూచించారు. బోయరేవులలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. రైతులు తామే స్వయంగా విత్తనాలు ఎలా తయారు చేసుకోవాలో వివరించారు. కార్యక్రమంలో ఏవో పవన్‌కుమార్, ఏఈవో సుధారాణి, సిబ్బంది అర్హత్ రైతులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

నంద్యాల రూరల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): నంద్యాలలో గురువారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సుగుణశ్రీ తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ మండల అధ్యక్షుడు శెట్టి ప్రభాకర్ అధ్యక్షతన నంద్యాల మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రెవెన్యూ, ప్రజా పంపిణీ, గృహ నిర్మాణం, విద్యా, వైద్యం తదితర అంశాలపై చర్చించనున్నటు తెలిపారు. గ్రామాలలో నెలకొన్న సమస్యలను సమావేశం దృష్టికి తెచ్చి పరిష్కరించుకోవాలని ఆమె సూచించారు. జడ్పీటీసీ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు హాజరు కావాలన్నారు.

'సదరం నమోదులోనే విభాగాలను గుర్తించాలి'

పాణ్యం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): సదరం నమోదులోనే అంగవైకల్య విభాగాన్ని గుర్తించాలని నంద్యాల డీసీహెచ్ఎస్ డాక్టర్ జఫ్రుల్లా సూచించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఈనెల 26 వతేదీన పాణ్యంలో పక్షవాతం రోగులు దూరప్రాంతాల నుంచి వచ్చి ఇబ్బందులకు గురైనట్లు పత్రికల్లో వచ్చిందన్నారు. కాగా పాణ్యంలో ఎముకలకు సంబంధించిన వైద్యుడు మాత్రమే పరీక్షలు నిర్వహిస్తారన్నారు. పక్షవాతానికి నరాల వైద్యుడు పరీక్షించాల్సి ఉందన్నారు. పక్షవాతానికి గురైన దివ్యాంగులకు నంద్యాలలోని న్యూరో సర్జన్‌ను కేటాయించినట్లు తెలిపారు. సదరం క్యాంపుకు నమోదు చేసే సమయంలో ఏ వైద్యుడి వద్దకు వెళ్లాలో నమోదు చేయాలన్నారు.

ఆధార్ కేంద్రం తనిఖీ


ఆధార్ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఎంపీడీవో

వెలుగోడు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): వెలుగోడు పట్టణంలో విద్యార్థుల సౌకర్యం కోసం ప్రత్యేకంగా ఆధార్ క్యాంపులను నిర్వహించి సేవలు అందిస్తున్నారు. బుధవారం చెంచు కాలనిలో విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన ఆధార్ క్యాంపను ఎంపీడీవో మధుసూదన్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. వెలుగోడు పట్టణంలోని 1,2, 5వ సచివాలయాలను ఆయన తనిఖీ చేశారు. సచివాలయ సిబ్బంది ఉన్నారు.

ఆర్జీఎంలో ఘనంగా జీఐఎస్ డే

పాణ్యం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): జీఐఎస్‌డే (జియోగ్రాఫిక్ ఇన్‌ఫర్మేషన్ సిస్టం) ఉత్సవాలను ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం ఐఈఈఈ విభాగం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బెంగుళూరు సెంట్రల్ యూనివర్సిటీ రహిషా ఐఐటీ ప్రొఫెసర్ డాక్టర్ గురు బాలామురుగన్, ఈశ్రీ ఇండియా గ్రూపు మేనేజరు మల్లేష్ బల్లీన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు జియోస్పెషియల్ టెక్నాలజీ ఆవశ్యకతను వివరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జయ చంద్రప్రసాద్, డీన్ డాక్టర్ అశోక్‌కుమార్, హెచ్‌ఓడి డాక్టర్ నరసింహులు, ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ సునందనరెడ్డి, డాక్టర్ రామిరెడ్డి, డాక్టర్ శ్రీనివాసులు విద్యార్థులు పాల్గొన్నారు.

పేద కుటుంబానికి చేయూత


రఫీకి నగదును అందజేస్తున్న మధుసూదన్‌రెడ్డి

బండిఆత్మకూరు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): నిరుపేద కుటుంబం దూదేకుల రఫీ జీవనోపాధికి టీడీపీ నాయకుడు వడ్డు మధుసూదన్‌రెడ్డి ఆర్థిక సాయం చేశారు. బుధవారం శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి ఆదేశాల మేరకు రఫీకి రూ.5వేల నగదును మధుసూదన్‌రెడ్డి అందజేశారు. తను టీ హోటల్ నిర్వహించుకునేందుకు కొంత నగదు సహాయం అందించిన టీడీపీ నాయకుడికి రఫీ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో హనుమంతరెడ్డి, ఆటో నారాయణ పాల్గొన్నారు.

'2.0 ప్రైమ్ వ్యవస్థను పునరుద్ధరించాలి'

నంద్యాల, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): రిజిస్ట్రేషన్ శాఖలో ఉన్న 2.0 ప్రైమ్ వ్యవస్థను కూటమి ప్రభుత్వం పునరుద్ధరించాలని ది నంద్యాల జిల్లా స్టాంప్ రైటర్లు, స్టాంప్ వెండర్ల సంక్షేమ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఫరూక్, రమేష్‌లు డిమాండ్ చేశారు. బుధవారం నంద్యాలలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట స్టాంప్ రైటర్లు, స్టాంప్ వెండర్లు ఆ సంఘం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. 2.0వ్యవస్థలో ప్రైవేట్ అటెండెన్స్ ప్రక్రియలేనందున వృద్ధులు, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న రోగులు ఇతర సమస్యలతో కార్యాలయానికి రాలేనివారికి ఎంతో ఇబ్బందికరంగా మారిందన్నారు. సంఘం కార్యవర్గసభ్యులు సుబ్రహ్మణ్యం, మాలిక్, మహబూబ్‌బాషా, శివరాం తదితరులు పాల్గొన్నారు.

నిందితుల అరెస్టు

పాణ్యం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కందికాయపల్లిలో ఈనెల 25వతేదీన జరిగిన కేబుల్ చోరీ సంఘటనలో నిందితులను బుధవారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ నరేంద్రనాథరెడ్డి తెలిపారు. ఈకేసులో అనుపూరు దానం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు కందికాయపల్లి సోలార్ ప్రాజెక్టులో ప్రవేశించి 2 వేల మీటర్ల కాపర్ తీగెలు దొంగిలించారని చెప్పారు. దర్యాప్తులో భాగంగా బుధవారం నిందితులను పెద్దమ్మ గుడి వద్ద అరెస్టు చేసి వారి వద్ద నుంచి 2వేల మీటర్ల తీగెలు, ఆటో, మోటారు సైకిల్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితుల్లో మహానంది మండలం ఆంజనేయ కొట్టాల గ్రామానికి చెందిన షేక్ ఖాదర్‌వలి, సిరివెళ్ల మండలం, మహాదేవపురంకు చెందిన గోసగుర్రప్ప, రుద్రవరం మండలం, కోటకొండ, శ్రీరంగాపురం గ్రామాలకుచెందిన దూదేకుల గుర్రప్ప, పల్లె వెంకటయ్య, నంద్యాల మండలం క్రాంతి నగర్‌కు చెందిన ముత్తుకూరి ఓబులేసులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని చెప్పారు. కార్యక్రమంలో సీఐ కిరణ్‌కుమార్ రెడ్డి, పోలీసు సిబ్బంది ఉన్నారు.

'నాణ్యత లోపం లేకుండా చూడాలి'

నంద్యాల రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): గుంతల పూడిక కార్యక్రమంలో నాణ్యతా ప్రమాణాలు లోపించకుండా చూడాలని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ అధికారులను కోరారు. పట్టణంలోని శ్రీనివాససెంటర్‌లో మంగళవారం రాత్రి ఆర్అండ్‌బీ అధికారులు చేపట్టిన గుంతల పూడిక కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికలలో ప్రజలకు యిచ్చిన హామీలను మంత్రి ఫరూక్ సహకారంతో పూర్తి చేయనున్నట్లు తెలిపారు.

సమస్యల పరిష్కారానికి కృషి: మంత్రి


సమస్యలను అడిగి తెలుసుకుంటున్న మంత్రి ఫరూక్

నంద్యాల రూరల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): సమస్యలను పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. నంద్యాలలోని టీడీపీ కార్యాలయంలో బుధవారం మంత్రి ఫరూక్ గ్రీవెన్ సెల్ నిర్వహించారు. నియోజకవర్గంలోని నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు సమస్యలను మంత్రి దృష్టికి తీకెళ్లారు. గ్రీవెన్‌సెల్‌కు వచ్చిన వినతి పత్రాలను ఆయన స్వీకరించారు. పరిష్కారం కోసం వీటిని ఆయా ప్రభుత్వ శాఖల అధికారులకు పంపించినట్లు తెలిపారు. ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తెస్తే పరిష్కరిస్తామన్నారు.

'క్రీడాకారులకు అన్ని విధాలుగా సహకారం'

ఆత్మకూరు రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులకు అన్ని విధాలుగా సహకరిస్తానని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి అన్నారు. ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి స్కూల్ ఫెడరేషన్ క్రీడల్లో పతకాలు సాధించిన విద్యార్థులకు బుధవారం పట్టణంలోని ఎంఎం ఫంక్షన్ హాలులో మెడల్స్, మొమెంటోలను అందజేశారు. ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని సూచించారు. క్రీడలకు శిక్షణ ఇచ్చి వారిని ప్రోత్సహించిన ఆత్మకూరు స్పోర్ట్స్ క్లబ్ చైర్మన్ పసిపిల్ మున్నాకుదేవానంద్, మహబూబ్ బాషా, అక్బర్, ఉపేంద్ర, ఖాజా హుసేన్‌ను ఈసందర్భంగా ఎమ్మెల్యే అభినందించారు. రైల్వే వాలిబాల్ కోచ్ నిమ్మి కృష్ణ యాదవ్, జాతీయ వాలిబాల్ కోచ్ అజ్గర్‌అలి, నరసింహారావులు పాల్గొన్నారు.

'నాణ్యత ప్రమాణాలు పాటించాలి'

నంద్యాల రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): విత్తనాలు ప్రాసెసింగ్ చేసేటప్పుడు నాణ్యత ప్రమాణాలు పాటించాలని జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ సూచించారు. బుధవారం జిల్లా వ్యవసాయ కార్యాలయంలో విత్తన శుద్ధి యజమానులతో సమావేశం నిర్వహించారు. డీఏవో మాట్లాడుతూ ప్రభుత్వం నుండి అనుమతి పొందిన రకాలను మాత్రమే మార్కెటింగ్ చేసుకోవాలన్నారు. నంద్యాల వ్యవసాయ సహాయ సంచాలకులు రాజశేఖర్, అశోక్‌వర్ధన్‌రెడ్డి, మండల వ్యవసాయ అధికారి ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక వైద్య కేంద్రాల తనిఖీ

ఆత్మకూరురూరల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరులోని సామాజిక వైద్య కేంద్రాన్ని బుధవారం డీసీహెచ్ఎస్ జఫ్రుల్లా ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి సిబ్బంది పని తీరు గురించి ఆరా తీశారు. అలాగే ఆసుపత్రిలో రోగులకు అందుతున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. వైద్యాధికారులు రాయుడు, షౌకత్ ఖాదీర్, లక్ష్మీప్రన్న, నాగరాజు, అనుపమ, సూపర్‌వైజర్ మస్తానయ్య, సిబ్బంది ఉన్నారు.

వెలుగోడు: వెలుగోడులోని సామాజిక అనుపత్రిని డీసీహెచ్ఎస్ జఫ్రుల్లా ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. వైద్యాధికారులు గోపాలకృష్ణుడు, సులోచన, ల్యాబ్ టెక్నీషియన్ పావని ఉన్నారు.

ముగిసిన రాష్ట్ర స్థాయి సెపక్‌తక్రా పోటీలు



బహుమతి అందజేస్తున్న అతిథులు

నందికొట్కూరు రూరల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): నందికొట్కూరు పట్టణంలోని శ్రీ నవనంది పాఠశాల మైదానంలో 27వ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ సెపక్‌తక్రా పోటీలు బుధవారం ముగిశాయి. రాష్ట్ర సెపక్‌తక్రా సంఘం, నంద్యాల సెపక్ తక్రా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించినట్లు రాష్ట్ర సెపక్ తక్రా సంఘం కార్యదర్శి శ్రీనివాసులు తెలిపారు. నందికొట్కూరులో జరిగిన పోటీలలో ఈస్ట్‌గోదావరి జిల్లా బాలుర జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది.. ద్వితీయ స్థానం అనంతపురం జిల్లా జట్టు కైవసం చేసుకొగా తృతీయ స్థానంలో ప్రకాశం జట్టు నిలిచాయి. బాలికల విభాగంలో అనంతపురం జిల్లా జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది. ద్వితీయ స్థానంలో ఈస్ట్ గోదావరి జట్టు నిలవగా, తృతీయ స్థానంలో విజయనగరం జిల్లా జట్టు నిలిచింది. గెలుపొందిన జట్లకు పథకాలను, మెమొంటోలను అందజేశారు. క్రీడాభారతి ప్రతినిధులు సుధాకర్, నంద్యాల ప్రైవేట్ విద్యాసంస్థల సంఘం అధ్యక్షుడు సుబ్బారెడ్డి, నవనంది పాఠశాల కరస్పాండెంట్ శ్రీధర్, వివిధ జిల్లాల సెపక్ తక్రా ప్రతినిధులు పాల్గొన్నారు.

నిత్యావసరాల అందజేత

బండిఆత్మకూరు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): జీసీ పాలెం గ్రామానికి చెందిన సమీర నివాస గుడిసె ఐదు రోజుల క్రితం దగ్ధం అయిన విషయం విదితమే. ప్రమాదంలో సర్వస్వం కాలిబూడిదైపోయిన కుటుంబ సభ్యులకు వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు సుబ్బరాయుడు, డేవిడ్, రాజు బుధవారం బియ్యం, కందిబేడలు, నూనె, ఇతర నిత్యావసరాలు అందజేశారు.

12న ర్యాంకింగ్ చెస్ పోటీలు

నంద్యాల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నంద్యాలలోని రామకృష్ణ డిగ్రీ కళాశాలవివేకానంద ఆడిటోరియంలో డిసెంబరు 12న రాష్ట్ర స్థాయి ర్యాకింగ్ చెస్ పోటీలు నిర్వహిస్తున్నట్లు నంద్యాల జిల్లా చెస్ సంఘం అధ్యక్షుడు, రాష్ట్ర ఐఎంఏ మాజీ అధ్యక్షుడు డా.రవికృష్ణ తెలిపారు. బుధవారం రామకృష్ణ డిగ్రీ అటానమస్ కాలేజీలో చెస్ పోటీల బ్రోచర్లను డా.రామకృష్ణారెడ్డి, డా.రవికృష్ణ, క్రీడా భారతి అధ్యక్షుడు సుధాకర్, చెస్ సంఘం జిల్లా కార్యదర్శి రామసుబ్బారెడ్డి విడుదల చేశారు. వారు మాట్లాడుతూ అండర్-12వయసు విభాగాల్లో వివిధ కేటగిరీల్లో పోటీలు జరుగుతాయన్నారు. ప్రతిభ కనబరచి ర్యాంకింగ్స్ సాధించిన వారికి జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే రాష్ట్ర జట్టుకు ఎంపిక చేస్తామన్నారు. డిసెంబరు 6లోపు ఎంట్రీలను ఆంధ్ర చెస్ అసోసియేషన్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. లయన్స్‌క్లబ్ నంద్యాలశాఖ అధ్యక్షుడు నిజాముద్దీన్, కార్యదర్శి రమేష్, జిల్లా చెస్ సంఘం సంయుక్తకార్యదర్శి రాజాచక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నివారణకు కృషి చేయాలి

● ప్రజలకు అధికారుల పిలుపు

మహానంది, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలను నివారణనకు కృషి చేయాలని ఈవోఆర్డీ నాగేంద్రుడు సూచించారు. బుధవారం ఎం.తిమ్మాపురంలోని ఎంపీడీవో కార్యాలయంలో విద్యార్థుల చేత అధికారులు బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. పంచాయతీ కార్యదర్శులు కలువ భాస్కర్, ఇర్ఫాన్, నాగేంద్ర నాయక్, సుమాంజలి, సుహాసిని, సచివాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

బండిఆత్మకూరు: యుక్త వయస్సురాని బాల, బాలికలకు వివాహాలు చేయటం చట్టరీత్యా నేరమని పలు గ్రామాల సర్పంచ్‌లు, సూపర్‌వైజర్ రమాదేవి, కార్యదర్శులు అన్నారు. బాల్య వివాహాలకు వ్యతిరేకంగా పలు గ్రామాల్లో అంగన్‌వాడీ సిబ్బంది ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీలు చేశారు. అంగన్‌వాడీ వర్కర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జూపాడుబంగ్లా: బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని వెలుగు సీసీలు గాంధీ, విజయలక్ష్మీ, నాయక్, నాగేశ్వరరావు అన్నారు.


తిమ్మాపురంలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు

జాతీయ బాల్యవివాహ రహిత దినోత్సవం సందర్భంగా బుధవారం జూపాడుబంగ్లాలో పొదుపు మహిళలు ర్యాలీ నిర్వహిం చారు. అనంతరం మానవహారం చేపట్టి ప్రతిజ్ఞ చేపట్టారు. పొదుపు సంఘాల మహిళలు, వీవోఏలు తిమ్మరాజు, గోపాల్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



శిరివెళ్లలో మాట్లాడుతున్న డీఎస్పీ రవి కుమార్

శిరివెళ్ల, నవంబరు 27(ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఆళ్లగడ్డ డీఎస్పీ రవి కుమార్ సూచించారు. వార్షిక తనిఖీలో భాగంగా బుధవారం శిరివెళ్ల పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. ముందుగా స్టేషన్‌కు చేరుకున్న డీఎస్పీకి పోలీసులు గౌరవ వందనం చేశారు. పోలీస్ స్టేషన్ పరిసరాలు, వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను డీఎస్పీ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే లింక్‌లను క్లిక్ చేయకూడదన్నారు. మహిళలు, బాలికలపై జరుగుతున్న అఘాయిత్యాల నియంత్రణకు కృషి చేయాలన్నారు. ఆళ్లగడ్డ సబ్ డివిజన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలపై నిఘా పెంచినట్లు తెలిపారు. గ్రామాల్లో ప్రజల ప్రశాంతతకు భంగం కలిగించే వారిని ఉపేక్షించేది లేదని డీఎస్పీ హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐ వంశీధర్, ఎస్ఐ చిన్న పీరయ్య, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రయాణికులకు మెరుగైన సేవలు



బస్టాండును తనిఖీ చేస్తున్న డీఎం వెంకటేశ్వర్లరావు

చాగలమర్రి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యమని ఆళ్లగడ్డ ఆర్టీసీ డిపో మేనేజర్ వెంకటేశ్వర రావు అన్నారు. బుధవారం చాగలమర్రి ఆర్టీసీ బస్టాండు, పరిసరాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఆళ్లగడ్డ డిపోలో 63 బస్సు సర్వీసులు ఉన్నాయని, కొత్తగా ఎని మిది బస్సులు ఏర్పాటు చేశామని తెలిపారు. డిపోలో కండక్టర్ల కొరత ఉందని, ఆర్టీసీ ఆదాయం నాలుగు శాతం తగ్గిందని అన్నారు. ఆయన వెంట సీనియర్ అధికారి శ్రీనివాసులు ఉన్నారు.

విద్యార్థులకు వృత్తి నైపుణ్యంపై శిక్షణ

చాగలమర్రి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు విద్యతో పాటు వృత్తి నైపుణ్యంపై కూడా శిక్షణ ఇవ్వడం వల్ల భవిష్యత్తులో ప్రయోజకులు అయ్యేందుకు ఉపయోగపడుతుందని శిక్షకులు బాలయ్య మధుసూదన్ అన్నారు. చాగలమర్రి పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఇండస్ట్రియల్ శిక్షణలో భాగంగా స్థానిక విద్యుత్ ఉపకేంద్రాన్ని బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యుత్ ఏఈ సాజహాన్ విద్యుత్ సరఫరా, ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ నియంత్రణ గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మహబూబ్‌బాషా, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ మహమ్మారిని తరిమికొడదాం



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకురాలు బీసీ ఇందిరమ్మ

బనగానపల్లె, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగలోగా పట్టణంలో ప్లాస్టిక్ భూతాన్ని తరిమికొడదామని, ఇందుకు విద్యార్థులు సహకరించాలని టీడీపీ నాయకురాలు బీసీ ఇందిరమ్మ కోరారు. బుధవారం పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ, ప్రజల ఆరోగ్య సంరక్షణ లక్ష్యంగా ప్లాస్టిక్‌ను బనగానపల్లెలో పూర్తిగా నియంత్రించి ప్లాస్టిక్ రహిత, హరిత నియోజకవర్గంగా తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. ప్లాస్టిక్ క్యారీబ్యాగులు, ప్లాస్టిక్ గ్లాసులు, ప్లాస్టిక్ వాటర్‌బాటిళ్ల వల్ల కలిగే నష్టాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో టంగుటూరు శ్రీనయ్య, ఉపాధ్యాయులు మాధవస్వామి, లక్ష్మణమూర్తి, యాగంటయ్య, జకీనాబేగం తదితరులు పాల్గొన్నారు.

మైక్ సెట్ వితరణ

బనగానపల్లె పట్టణంలోని కొండపేటలోని బాలుర ఉన్నతపాఠశాలకు మైక్ సెట్‌ను టీడీపీ నాయకురాలు బీసీ ఇందిరమ్మ బుధవారం వితరణగా అందించారు. ఈ సందర్భంగా బీసీ ఇందిర్మకు విద్యార్థులు, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు.

టీడీపీ కార్యాలయం ఆవరణంలో..

బనగానపల్లె: పట్టణంలోని టీడీపీ కార్యాలయం ఆవరణంలో బీసీ ఇందిరమ్మ ఆధ్వర్యంలో అయ్యప్పస్వామికి పడిపూజ కార్యక్రమాలు నిర్వహించినట్లు మంత్రి బీసీ వ్యక్తిగత కార్యదర్శి మురళీమోహన్‌రెడ్డి బుధవారం తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బీసీ రామనాథరెడ్డి, వంగాల పరమేశ్వరరెడ్డి, కాట్రెడ్డి మల్లి ఖార్జునరెడ్డి, మంచాల మద్దిలేటిరెడ్డి మహేశ్వరమ్మ పాల్గొన్నారు.

పొదుపు చేయడం నేర్చుకోవాలి

బనగానపల్లె, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): భావిభారత పౌరులైన విద్యార్థులు చిన్నతనం నుంచే పొదుపు చేయడం నేర్చుకోవాలని జేకేసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బ్రహ్మానందరావు సూచించారు. బుధవారం మండలంలోని హుసేనాపురం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు బుగ్గ రామేశ్వరస్వామి భక్త మండలి సహకారంతో విద్యార్థులకు రాత పుస్తకాలు, ఇతర సామగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో పలుకూరు పద్మనాభ డాక్టర్ చైతన్య, పాఠశాల హెచ్‌ఎం మద్దిలేటినాయక్, విద్యా కమిటీ చైర్మన్ పకీరాబీ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి

ప్యాపిలి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యాధికారి వాణిశ్రీ అన్నారు. బుధవారం కేజీబీవీలో విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఆరోగ్య సూత్రాలు వివరించారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోండి

బేతంచెర్ల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రభుత్వ పథకాలను గ్రామాల్లోని రైతులు, ప్రజలు సద్వినియోగం చేసుకునేలా ఉపాధి సిబ్బందిని అప్రమత్తం చేయాలని డీఎల్‌డీవో నరసింహారెడ్డి సూచించారు. బుధవారం సాయంత్రం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఫజుల్ రెహిమాన్ అధ్యక్షతన ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీవో శేషన్న, ఏవో దస్తగిరిబాబు, హనీఫా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు, సచివాలయాల సిబ్బంది, డీఎలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ గృహాలకు దరఖాస్తులు చేసుకోవాలి

సంజామల, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఇళ్లు లేని పేదలు ప్రభుత్వ గృహాలకు దరఖాస్తు చేసుకోవాలని హౌసింగ్ ఏఈ బాల చంద్రుడు సూచించారు. బుధవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన 2.0 కింద ప్రభుత్వ గృహాలు మంజూరయ్యాయని అన్నారు. లబ్ధిదారుడు కుటుంబంలోని భార్య, భర్త ఆధార్ కార్డు, జాబ్‌కార్డు, రేషన్ కార్డు, బ్యాంకు ఖాతా, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు సంజామల హౌసింగ్ ఏఈ కార్యాలయంలో అందజేయాలని ఆయన కోరారు. అర్హులందరికి ప్రభుత్వం గృహాలు మంజూరు చేస్తుందన్నారు.

పంటలకు తుఫాన్ ముప్పు

ఆందోళనలో అన్నదాతలు



పూత దశలో ఉన్న కంది పంట

కొలిమిగుండ్ల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తుఫాన్‌గా బలపడుతోందన్న వాతావరణ శాఖ హెచ్చరికలు రైతుల గుండెల్లో గుబులు పుట్టిస్తోంది. వారం రోజుల పాటు తుఫాన్ ప్రభావం ఉండే అవకాశం ఉందని రైతులు అప్రమత్తంగా ఉండాలని ఇప్పటికే వాతావరణ శాఖ అధికారులు హెచ్చరించారు. రెండు రోజులుగా జిల్లావ్యాప్తంగా మబ్బులు కమ్ముకుంటున్నాయి. దీంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా జిల్లాలో అత్యధికంగా 43వేల హెక్టార్లలో సాగు చేసిన కంది పంట పూత దశలో ఉండటంతో కంది రైతుల గుండెల్లో రైళ్లు పరుగెత్తుతున్నాయి. కమ్ముకున్న మసురు వాతావరణం కారణంగా పూతకు తీవ్ర హాని కలిగిస్తుందని ఆవేదన చెందుతున్నారు. మరోవైపు సాగునీరు చేసుకున్న మొక్క జొన్న కోత దశలో ఉన్న వరి రైతుల్లో కూడా తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. జిల్లాలోని పలు ప్రాంతాల్లో వరి కోతలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఈ సమయంలో వర్షం కురిస్తే పెద్ద ఎత్తున నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని రైతులు వాపోతున్నారు. నూర్పిడి చేసుకున్న మొక్క జొన్న పొలాలు, కల్లాల్లో ఉన్నందున తడిచిపోయి రంగుమారే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

చిన్నారులకు పౌష్టికాహారం ఇవ్వాలి: కలెక్టర్



డబ్ల్యూ. గోవిందిన్నెలోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

దొర్నిపాడు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): చిన్నారులకు పౌష్టికాహారం తప్పనిసరిగా ఇవ్వాలని కలెక్టర్ రాజకుమారి ఆదేశించారు. బుధవారం మండలంలోని చాకరాజువేముల, డబ్ల్యూకొత్తపల్లె, డబ్ల్యూగోవిందిన్నె గ్రామాల్లో కలెక్టర్ పర్యటించారు. చాకరాజువేములలో బీసీ కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డును, డబ్ల్యూకొత్తపల్లెలోని సచివాలయాన్ని తనిఖీ చేశారు. డబ్ల్యూగోవిందిన్నె గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లి చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారం, పిల్లల సంఖ్యను పరిశీలించారు. గుడ్లు, పౌష్టికాహారం చిన్నారులకు తప్పకుండా అందించాలని సిబ్బందిని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రంలో గుడ్లు లేవని చెప్పడంతో కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. చిన్నారులకు అందించే పౌష్టికాహారంపై నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. అంగన్‌వాడీ కేంద్రం, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. సచివాలయాల్లో సిబ్బంది పనితీరు గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది సమయ పాలన పాటించి ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికి అందేలా చూడాలని అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుభద్ర, సచివాలయ సిబ్బంది, పాములేటి ఉన్నారు.

అంకితభావంతో పని చేయాలి: డీఈవో



ఆళ్లగడ్డలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డీఈవో జనార్దన్‌రెడ్డి

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), నవంబరు 27(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లోని ఉపాధ్యాయులు అంకిత భావంతో విధులు నిర్వర్తించాలని జిల్లా విద్యాశాఖ అధికారి జనార్దన్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని వైపీపీఎం ప్రభుత్వ పాఠశాలను డీఈవో తనిఖీ చేశారు. తరగతి గదులను పరిశీలించి విద్యార్థులకు ఏస్థాయిలో బోధన జరుగుతుందో అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయుల, విద్యార్థుల హాజరుపట్టీలు, పాఠశాల రికార్డులను డీఈవో తనిఖీ చేశారు. పాఠశాలలోని మరుగుదొడ్లు, వాటి నిర్వహణను పరిశీలించారు. మరిన్ని మరుగుదొడ్లను నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. విద్యార్థులకు వడ్డిస్తున్న మధ్యాహ్న భోజనంలో నాణ్యత తగ్గిందని గుర్తించడంతో నిర్వాహకులను హెచ్చరించారు. ఉపాధ్యాయులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు ఉపాధ్యాయులు సరైన ప్రణాళికతో వ్యవహరించాలన్నారు. వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి పాఠశాల ఆవరణలో డీఈవో జనార్దన్‌రెడ్డి మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంఈవో-2 గంగాధర్, పాఠశాల హెచ్‌ఎం వీర రామయ్య ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యుత్ చౌర్యానికి పాల్పడితే చర్యలు



కొలిమిగుండ్ల: ఓ ఇంటి వద్ద అక్రమ విద్యుత్ తీగలను పరిశీలిస్తున్న అధికారులు

అవుకు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ చౌర్యానికి పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని విజిలెన్స్ ఈఈ గోపీ హెచ్చరించారు. బుధవారం మండలంలోని చెర్లోపల్లె, రామాపురం గ్రామాల్లో సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ చౌర్యానికి సంబంధించి ఐదు కేసులు నమోదు చేసి రూ. 80 వేలు జరిమానా విధించామన్నారు. అలాగే అదనపు లోడ్‌కు సంబంధించి పది కేసులు నమోదు చేసి రూ. 1.70 లక్షలు జరిమానా వేశామన్నారు. కార్యక్రమంలో విజిలెన్స్ ఏడీఈ క్రిష్ణమూర్తి, ఏఈ శ్రీనివాసరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

కొలిమిగుండ్ల మండలంలో..

కొలిమిగుండ్ల: మండలంలోని వివిధ గ్రామాల్లో విద్యుత్ శాఖ విజిలెన్స్ అధికారులు బుధవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఏపీ ట్రాన్స్‌కో ఈఈ గోపీ ఆధ్వర్యంలో సిబ్బంది మండలంలోని కనకాద్రిపల్లె, కొలిమిగుండ్ల, అంకిరెడ్డిపల్లె గ్రామాల్లో తనిఖీలు చేపట్టారు. అక్రమ విద్యుత్ వినియోగిస్తున్న వివిధవర్గాల వారిపై 18కేసులు నమోదు చేసి, రూ. 1.70లక్షలు జరిమానా విధించినట్లు ఇన్‌చార్జి ఏఈ లక్ష్మణ్‌స్వామి వెల్లడించారు. అదేవిధంగా అక్రమ అదనపు విద్యుత్ వినియోగించే 10మందిపై కేసులు నమోదు చేసి, రూ. 1.50లక్షలు జరిమానా విధించారని తెలిపారు.

దైవచింతన అలవర్చుకోవాలి



కేషావలి శర్మ దంపతులను సన్మానించిన డీఎస్పీ శ్రీనివాసులు

డోన్ రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ దైవ చింతన అలవర్చుకుని సన్మార్గంలో నడవాలని డోన్ డీఎస్పీ శ్రీనివాసులు ఆకాంక్షించారు. పట్టణంలోని సాంబశివాలయంలో బుధవారం రాత్రి కార్తీకమాసం పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీతో పాటు సబ్‌కోర్టు సీనియర్ సివిల్ న్యాయాధికారి శంకరయ్య, పట్టణ సీఐ ఇంతియాజ్ బాషా, రూరల్ సీఐ రాకేష్‌బాబు, పట్టణ ఎస్ఐ శరత్ కుమార్ రెడ్డిలు హాజరయ్యారు. సాంబ శివాలయంలో జరిగిన కార్తీక మాస వేడుకల్లో శతావధాని దత్తాత్రేయ శర్మ పాల్గొని కార్తీకమాస విశిష్టతను భక్తులకు వివరించారు. అనంతరం సాంబశివాలయం అర్చకులు శేషావలి శర్మ దంపతులను డీఎస్పీ శ్రీనివాసులు గాయత్రి పీఠం తరఫున శాలువాలతో సన్మానించారు.

వైద్య పరికరాలకు ప్రతిపాదనలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు రూ.3 కోట్ల విలువ చేసే పలు రకాల వైద్య పరికరాల సమకూర్చాలని ఆ శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లడంతో పాటు సంబంధిత ప్రతిపాదనలు పంపినట్లు ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ తెలిపారు. పట్టణంలోని ఎమ్మెల్యే స్వగృహంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ గండ్లేరు రిజర్వాయర్ సామర్థ్యాన్ని పెంచేందుకు అవసరమైన ప్రతిపాదనలను పూర్తి చేశామని.. నిధులు కేటాయించాలని కోరుతూ మంత్రికి వెల్లడించారు. ఆళ్లగడ్డలో అవినీతి, అక్రమాలు జరుగుతున్నా యంటూ ఆధారాలు లేకుండా కొన్ని గిట్టేరా మాట్లాడితే సహించేది లేదని ఎమ్మెల్యే హెచ్చరించారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ

దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూ గోవిందిన్నె గ్రామానికి చెందిన నాగేశ్ సురేఖకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రూ.28,900 చెక్కును బుధవారం ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అందజేశారు. టీడీపీ నాయకులు బాబు, వాసు, హరి తదితరులున్నారు.

ఆయన సీఎం రిలీఫ్ ఫండ్ కోసం దరఖాస్తు చేసుకోగా... శ్రీరంగాపురం వద్ద ఉన్న సీసీడబ్ల్యూ పథకం పనులు నిలిచి పోవడంతో పలు గ్రామాల ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి ఇబ్బందులను ఉప ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లడంతో సమస్య పరిష్కా రానికి ఆయన హామీ ఇచ్చినట్లు వెల్లడించారు.

బండలాగుడు పోటీల్లో విజేతగా రామాపురం ఎద్దులు

బేతంచెర్ల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : కార్తీకమాసం పురస్కరించుకుని మండలంలోని సంకలాపురం గ్రామంలో వెలసిన స్వామి తిరునాల సందర్భంగా నిర్వహించిన అంతర్రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీల్లో ప్రథమ విజేతగా రామాపురం ఎద్దులు నిలిచాయి. ఈ పోటీల్లో పది జతల ఎద్దులు పాల్గొనగా, రామాపురం గ్రామానికి చెందిన రామచంద్ర రెడ్డి ఎద్దులు మొదటి విజేతగా నిలిచి రూ.30వేలు, వెంకటగిరికి చెందిన కృష్ణ ప్రసాద్, తాండ్రపాడుకు చెందిన చిన్న రత్నం ఎద్దులు రెండో బహుమతి కింద రూ.25వేలు, పి న్యాపరం గ్రామానికి చెందిన బొడ్డప్పగారి వెంకట కృష్ణయ్య ఎద్దులు మూడో విజేతగా నిలిచి రూ.20వేలు, బహుమతులను ఎద్దుల యజమానులకు నిర్వాహకులు అందజేశారు. కార్యక్రమంలో రైతులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం.. కేసు నమోదు

బేతంచెర్ల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని కొత్తబస్టాండు ప్రాంతంలో నివాసముంటున్న షేక్ టిప్పు హిమాయత్ అనే వ్యక్తి అదృశ్యమైనట్లు కేసు నమో దు చేశామని హెడ్ కానిస్టేబుల్ చంద్రశేఖరప్ప బుధవారం తెలిపారు. ఈ నెల 25న హిమాయత్ కర్నూలుకు వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదన్నా రు. తండ్రి మహ్మద్ రఫీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

చేనేతకు పూర్వ వైభవం తీసుకురావాలి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మంత్రులు సవిత, బీసీ జనార్దన్‌రెడ్డి

బనగానపల్లె, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): బనగానపల్లె నియోజక వర్గంలో చేనేతలు అధికంగా ఉన్నారని, చేనేత వృత్తులకు పూర్వ వైభవం తీసుకురావాలని చేనేత శాఖ మంత్రి సవితమ్మను రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి కోరారు. బుధవారం ఏపీ ఖాదీ గ్రామీణ పరిశ్రమల బోర్డు చైర్మన్‌గా కేకే చౌదరి బాధ్యతలు స్వీకరించారు. ప్రమాణ స్వీకారోత్సవంలో మంత్రులు సవితమ్మ, బీసీ జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి బీసీ మాట్లాడుతూ ఖాదీ ఉత్పత్తులపై ఆధారపడి ఎంతో మంది చేనేత కార్మికులు జీవనం సాగిస్తున్నారన్నారు. వారిని ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. తన సొంత నియోజకవర్గం బనగానపల్లె పట్టణం ఒకప్పుడు చేనేత రంగానికి ప్రసిద్ధి అన్నారు. సరైన ప్రోత్సాహం లేకపోవడంతో చేనేతరంగం బనగానపల్లె పట్టణంలో నిర్వీర్యమైందన్నారు. మళ్లీ బనగానపల్లెలో జీవం పోయాలని కోరారు. సమావేశంలో ఏపీ సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రేపు వనభోజనం

డోన్ రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కొండపేటలో ఎల్లమాంబేశ్వరదేవి ఆలయం వద్ద ఈ నెల 29న నిర్వహించనున్న కార్తీక వనభోజన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఏకు నాగరాజు పిలుపునిచ్చారు. జ్యోతిరావుపూలే, సావిత్రి బాయి పూలే జీవిత చరిత్రపై విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తిగల వారు తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఆయన కోరారు.

బాల్య వివాహాల నివారణకు సహకరించాలి

చాగలమర్రి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో బాల్యవివాహాలను నివారించేందుకుప్రతి ఒక్కరు సహకరించాలని వెలుగు ఏపీఎం నాగమ్మ అన్నారు. బుధవారం చాగలమర్రి వెలుగు కార్యాలయంలో పొదుపు మహిళలకు బాల్య వివాహాల నిర్మూలనపై ప్రతిజ్ఞ చేయించారు. పొదుపు మహిళలు గ్రామాల్లో ప్రజలకు బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో వెలుగు సీసీలు హైమావతి, చిన్నయ్య, దిల్షాద్, మస్తానమ్మ, సాహిదా పాల్గొన్నారు.

స్వయం ఉపాధిపై శిక్షణ

చాగలమర్రి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పొదుపు మహిళలు స్వయం ఉపాధితో ఆర్థిక అభివృద్ధి చెందాలని ఉమ్మడి జిల్లా కెనరాబ్యాంకు కో-ఆర్డినేటర్ వెంకటేష్ అన్నారు. బుధవారం చాగలమర్రి వెలుగు కార్యాలయంలో ఏపీఎం నాగమ్మ ఆధ్వర్యంలో పొదుపు మహిళలకు శిక్షణ ఇచ్చారు.

క్రీడలను ప్రోత్సహించడమే లక్ష్యం



క్రీడలను ప్రారంభిస్తున్న దాత షబ్బీర్‌అహ్మద్

చాగలమర్రి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతంలో క్రీడలను ప్రోత్సహించడమే లక్ష్యమని దాత, పారిశ్రామికవేత్త షబ్బీర్ అహ్మద్ అన్నారు. బుధవారం చాగలమర్రి బాలుర ఉన్నత పాఠశాలలో క్రికెట్ క్రీడాకారుల కోసం నెట్లను ఆయన వితరణగా అందజేశారు. అనంతరం క్రీడా పోటీలను ప్రారంభించారు. క్రీడాభివృద్ధికి సహకరిస్తున్న దాతను హెచ్‌ఎం కోటయ్య, పీడీ దాదాపీర్, ఉపాధ్యాయులు సన్మానించారు. కార్యక్రమంలో క్రీడాకారులు జంషీర్ పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడులు

చాగలమర్రి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడులు సాధించవచ్చని ఏవో రంగ నేతాజీ సూచించారు. బుధవారం మండలంలోని పెద్దవంగలి, చిన్నవంగలి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏవో మాట్లాడుతూ తుఫాన్ ప్రభావం వల్ల వరి పంట నేలవాలి దెబ్బతినకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. పంటల బీమా ప్రీమియం చెల్లిస్తే పరిహారం వస్తుందన్నారు. డిసెంబరు 15వరకు గడువు ఉందని అన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రబీ పంటల బీమా చేయించుకోండి

బనగానపల్లె, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రైతులు రబీలో వేసిన జొన్న, పప్పుశనగ పంటలకు బీమా చేయించుకోవాలని బనగానపల్లె మండల వ్యవసాయాధికారి సుబ్బారెడ్డి కోరారు. బుధవారం మండలంలోని యనకండ్ల, యాగంటిపల్లె గ్రామాల్లో రైతులకు పంటల బీమాపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం అధికారి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

పని వేళలు పాటించాలి

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), నవంబరు 27(ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు తప్పనిసరిగా సమయపాలన పాటించాలని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై చర్యలు తప్పవని ఐసీడీఎస్ సీడీపీవో తేజేశ్వరి హెచ్చరించారు. బుధవారం పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయ ఆవరణలో సెక్టార్ సమావేశం నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో రికార్డుల నిర్వహణ, చిన్నారులు, గర్భిణులకు అందిస్తున్న పౌష్టికాహారం తదితర వాటి గురించి సీడీపీవో చర్చించారు. అనంతరం సలహాలు, సూచనలు అందజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ పార్వతి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రీడా పరికరాల పంపిణీ



క్రీడా పరికరాలు అందిస్తున్న అల్ట్రాటెక్ ప్రతినిధులు

కొలిమిగుండ్ల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు క్రీడా పరికరాలను పంపిణీ చేస్తున్నట్లు అల్ట్రాటెక్ ప్రతినిధులు తెలిపారు. బుధవారం మండలంలోని గొర్విమానుపల్లె జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థుల కు రూ.40వేలు విలువ చేసే క్రీడా సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని కోరారు. కార్యక్రమంలో అల్ట్రాటెక్ సిమెంట్ పరిశ్రమ హెచ్ఆర్ హెడ్ రంగకుమార్, అడ్మిన్ హెడ్ వెల్లోడి అంజన్‌ప్రకాశ్, స్వరూప్‌నాయుడు, గోపాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టీడీపీ రాష్ట్ర కార్యదర్శికి కేఈ పరామర్శ



నాగేశ్వరరావుతో మాట్లాడుతున్న కేఈ కృష్ణమూర్తి, తిక్కారెడ్డి

ప్యాపిలి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, జాతీయ బీసీ నాయకుడు పి నాగేశ్వరరావును బుధవారం మాజీ ఉపముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి, టీడీపీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా కేఈ వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని కోరారు. అలాగే ధైర్యంగా ఉండాలని, త్వరలోనే కోలుకుంటావని నాగేశ్వరరావుకు ధైర్యం చెప్పారు.

తుంటి ఎముక శస్త్ర చికిత్స విజయవంతం



బాధితురాలితో సూపరింటెండెంట్ హనీఫ్, ఆర్థోపెడిక్ డాక్టర్ గౌస్ బాషా

డోన్ రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని డోన్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి లో మొదటి సారిగా చేసిన తుంటి ఎముక శస్త్ర చికిత్స విజయవంతమైంది. మద్దమ్మ అనే మహిళ తుంటి ఎముక నొప్పి సమ స్యతో బాధపడు తూ డోన్ ఏరియా ఆసుపత్రిలో చేరింది. డోన్ ఏరియా ఆసుపత్రి ఆర్థోపెడిక్ గౌస్‌బాషా తుంటి ఎముకకు శస్త్ర చికిత్స విజ యవంతంగా చేశారు. బాధితురాలు డాక్టర్లకు కృతజ్ఞతలు తెలి పారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ హనీఫ్ పర్యవేక్షణలో శస్త్ర చికిత్స విజయవంతం అయింది.